ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
మంగళవారం 24 సెప్టెంబరు 2024





ఐదేళ్ల వైసీపీ పాలనలో కౌలు రైతు పూర్తిగా నిర్లక్ష్యానికి గురయ్యాడు. 2014--19 మధ్య ఉన్న కౌలు రైతు కార్డు విధానంలో మార్పులు తీసుకొచ్చి అన్నింటినీ సీసీఆర్‌సీ(క్రాప్ కల్టివేటర్స్ రైట్ కార్డ్) కార్డుతో ముడి పెట్టి కౌలు చేయడమంటేనే గుది బండ అనే స్థాయికి గత ప్రభుత్వం తీసుకొచ్చింది. రుణాలు మొదలుకుని నష్ట పరిహారం వరకు అడుగడుగునా కౌలు రైతు ఐదేళ్ల పాటు నానా ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో ఇకపై తమ ఇక్కట్లకు తెరపడ్డట్టేనని కౌలు రైతాంగం భావించింది. దానికి అనుగుణంగా కూటమి ప్రభుత్వం సీసీఆర్‌సీ కార్డుల విషయంలో పెద్ద ఎత్తున లక్ష్యాలను విధించి వ్యవసాయ సిబ్బందిని పరిగెత్తించింది. గడిచిన ఆర్థిక సంవత్సరంతో పోల్చుకుంటే కౌలు హక్కు పత్రాలను అన్నదాతలకు అందించడంలో గణనీయమైన పురోగతినే ప్రభుత్వం సాధించింది. పెరిగిన సీసీఆర్‌సీ కార్డుల సంఖ్యతో పాటు కౌలు రైతులకు రుణాలు అందించే విషయంలో బ్యాంకర్లు ఉదారంగా వ్యవహరించాలని ప్రభుత్వం కోరింది. కానీ గత ప్రభుత్వంలో బ్యాంకర్ల తీరు ఎలా ఉందో ఇప్పుడు కూడా దాదాపుగా అదేరీతిన ఉండడంతో కౌలు రైతులకు రుణాల విషయంలో అన్యాయం జరుగుతూనే ఉంది.

కౌలు రైతులపై.. కనికరమేది..?

మరీ తీసికట్టుగా..

బాపట్ల జిల్లాలో ఖరీఫ్‌సీజన్‌కు గాను రూ.3,750 కోట్లను లక్ష్యంగా అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో 5 శాతం వాటా అంటే దాదాపు రూ. 180 కోట్లు కౌలు రైతులకు దక్కాల్సి ఉంది. కానీ దాదాపుగా ఖరీఫ్ ముగింపుకొచ్చింది, రుణ లక్ష్యాలు పూర్తయ్యాయి. కానీ చివరికి కౌలు రైతులు అందుకున్న రుణాలు రూ.18 కోట్లలోపే ఉండడం వారికి రుణాలు అందించే విషయంలో ప్రభుత్వం మారినా పురోగతి లేదనే దానికి సూచికగా కనబడుతోంది. ఇక గతేడాది వైసీపీ ప్రభుత్వంలో అయితే ఇది పది కోట్లలోపే ఉండడం గమనార్హం. ఇక గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కూడా వేల కోట్లతో వార్షిక రుణ పద్దును బ్యాంకర్లు ప్రకటించారు. తీరా ముగింపు కొచ్చేసరికి గుంటూరు జిల్లాలో రూ.7 కోట్లు, పల్నాడు జిల్లలో రూ.11 కోట్లలోపులనే కౌలు రైతులు అందుకున్న రుణాలు ఉండడం వారి రుణ దీన స్థితికి అద్దం పడుతోంది. మూడు జిల్లాల పరిధిలో గతంతో పోలిస్తే ప్రభుత్వ చొరవ వల్ల సీసీఆర్‌సీ కార్డుల జారీలో గణనీయమైన పురోగతి కనబడింది. కానీ వాటిని ఎక్కువ శాతం మంది కౌలు రైతులు తీసుకునేదే బ్యాంకుల నుంచి రుణాలు వస్తాయనే ఆశతోనే. కానీ అంతిమంగా జారీ చేసిన సీసీకార్డుల్లో 15 శాతం మందికి కూడా రుణాలు అందకపోవడంతో వాటిని తమకు ఇచ్చి లాభమేంటనే ప్రశ్న రైతుల నుంచి వస్తోంది.



బ్యాంకర్ల సహకారం లేకపోవడం వల్లే..

వార్షిక పద్దు ప్రకటించేటప్పుడు ప్రభుత్వ ప్రాథమ్యాలకు అనుగుణంగా కౌలు రైతులకు రుణాలు అందించే విషయంలో సహకరిస్తామని బ్యాంకర్లు చెబుతారు. కానీ ఆచరణలోకొచ్చేసరికి సవాలక్ష నిబంధనలతో వారికి మొండిచెయ్యి చూపించడం వల్లే కౌలు రైతులకు రుణాలు అందించడంలో ఈ దుస్థితి తలెత్తుతోంది. పైగా అందించే ఆ అరకొర రుణాలు కూడా పూర్తిగా వ్యక్తిగత రుణాలు కాకుండా రైతు మిత్ర గ్రూపులు, జాయింట్ ఫార్మర్స్ గ్రూప్స్ కలిస్తేనే రుణాలు ఇంత తీసికట్టుగా ఉంటున్నాయి. అదే ఇక వ్యక్తిగత రుణాల వరకే లెక్క తీస్తే ఈ గణాంకాలు మరీ కుచించుకుపోవడం ఖాయంగా కనిపిస్తోంది. ప్రభుత్వం కూడా ఆర్థిక సంవత్సరం ఆరంభంలో సమావేశం పెట్టి వార్షిక పద్దు ప్రకటించి రుణాల విషయంలో మార్గనిర్దేశకాలు జారీ చేసి మిన్నకుండడం కూడా బ్యాంకర్ల వైపు నుంచి సహకారం అందకపోవడానికి కారణంగా కనబడుతోంది. నెలకొకసారి కౌలు రైతులకు అందించే రుణాల విషయంలో సమీక్ష జరిపి బ్యాంకులకు కూడా కౌలు రైతులకు అందించే రుణాల విషయంలో లక్ష్యాలు నిర్దేశిస్తేనే పరిస్థితి మెరుగుపడే అవకాశం ఉంది. లేదంటే ఏటా వార్షిక పద్దులో ఘనంగా కౌలు రైతుల వాటా ఇంతని గొప్పలు చెప్పడం తర్వాత వాటిని పట్టించుకోకపోవడం మొక్కుబడి తతంగంగా నిలిచిపోతోంది.

బాపట్ల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వార్షిక పద్దు ఆధారంగా ఖరీఫ్ రుణ లక్ష్యం దాదాపు పూర్తయింది. ఇందులో కౌలు రైతుల వాటా తీస్తే నానాటికీ తీసికట్టు నాగంబొట్టు అన్న చందాన ఉంది తప్పితే వారికి గతంతో పోలిస్తే అదనంగా ఒనగూరిన ప్రయోజనం గుండుసున్నా. కౌలు రైతులను ఆదుకోవాలనే ప్రభుత్వ లక్ష్యాలను దెబ్బతీసే విధంగా బ్యాంకర్లు నిబంధనల ఉచ్చు వేసి కౌలు రైతులకు మొండిచెయ్యి చూపిస్తున్నారు. దీనికి తోడు సీసీఆర్‌సీ కార్డులు జారీ చేసి వ్యవసాయ శాఖ మిన్నకుండడం కూడా కౌలు రైతులకు రుణాల విషయంలో ఇప్పటికీ అన్యాయం జరుగుతూనే ఉంది. ఈ ఖరీఫ్ సీజన్ ఆరంభంలో కౌలు రైతుల రుణ వాటాలో ప్రభుత్వం నిర్దేశించిన మొత్తాలను ఇప్పుడు జారీ చేసిన మొత్తాలను పోలిస్తే రుణాల విషయంలో బ్యాంకుల నిర్లక్ష్యం బయటపడుతోంది. కూటమి ప్రభుత్వం మీద ఎన్నో ఆశలు పెట్టుకున్నామని కానీ ఇప్పటికీ రుణాల విషయంలో తమకు నిరాశే ఎదురవుతుందని కౌలు రైతాంగం వాపోతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కౌలు రైతులకు అందించిన రుణాల మీద సమీక్ష జరిపి న్యాయం చేయాలని అన్నదాతలు అభ్యర్థిస్తున్నారు

- ప్రభుత్వం మారినా.... కౌలు రైతుకు సున్నా...!
- రుణాలు అందించడంలో సహకరించని బ్యాంకర్లు
- సీసీఆర్‌సీ కార్డుల జారీతో సరి.. రుణాల మాటేమిటి !
- వేల కోట్లతో ఘనంగా ఖరీఫ్ వార్షిక పద్దు
- కౌలు రైతుల వాటా మాత్రం తీసికట్టుగానే..

సీసీఆర్‌సీ కార్డుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ...

కౌలు రైతులకు అందించే సీసీఆర్‌సీ కార్డుల జారీ విషయంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు అందులో విజయవంతమయింది. గత ప్రభుత్వంలో మంజూరు చేసిన వాటితో పోలిస్తే గణనీయమైన పురోగతిని సీసీఆర్‌సీ కార్డులను కౌలు రైతులకు అందించే విషయంలో సాధించింది. పెట్టుకున్న లక్ష్యాలలో దాదాపు 85 శాతం వరకు కార్డులను కౌలు రైతులకు అందించారు. బాపట్ల జిల్లాలో 1,06,300 సీసీఆర్‌సీ కార్డులను కౌలు రైతులకు అందించాలనే లక్ష్యాన్ని ప్రభుత్వం పెట్టుకోగా ఇందులో ఇప్పటికే 86,500 కార్డులను అందించింది. అదే విధంగా గుంటూరు జిల్లాలో 46,800, పల్నాడులో 66,000 కార్డులను అందించాలని లక్ష్యం పెట్టుకోగా ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా 85శాతం కార్డులను ఇప్పటికే అందించి గత ప్రభుత్వంతో పోలిస్తే మెరుగైన ఫలితాలను కూటమి ప్రభుత్వం సాధించింది

వార్షిక పద్దు వేల కోట్లలో...

ఏటా ఆర్థిక సంవత్సరం ఆరంభంలో బ్యాంకర్లతో సమావేశమై జిల్లాల వారీగా వార్షికపద్దును ప్రకటించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ పద్దుల్లో అగ్రతాంబూలం సేద్యానిదే ఉంటుంది. గత ప్రభుత్వంలో వ్యవసాయ రుణాల్లో కౌలు రైతుల వాటాను నిర్దిష్టంగా నిర్వచించేది కాదు. దీంతో వారి కేటాయింపుల విషయంలోనూ స్పష్టత లోపించేంది. కానీ కూటమి ప్రభుత్వం కొలువుదీరాక వ్యవసాయ రుణాల్లో కౌలు రైతాంగం వాటా 5 శాతం వరకు ఉండాలని, ఇందుకు బ్యాంకర్లు కూడా మానవతా దృక్పథంతో సహకరించాలని ఖరీఫ్ ఆరంభంలోనే తెలిపింది. వాస్తవానికి కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డులు తీసుకునేదే బ్యాంకు రుణాల వస్తాయనే ఆశతోనే. ఖరీఫ్ ముగింప ుకొచ్చింది...బ్యాంకులు తాము రుణ లక్ష్యాలను చేరుకున్నామనే గొప్పలూ చెప్పుకుంటున్నాయి. కానీ కౌలు రైతులకు అందిన రుణ మొత్తాలను పరిశీ లిస్తే విస్తుపోవడం ఖాయంగా కనిపిస్తోంది.

కొత్త ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నాం..

రుణాల విషయంలో గత వైసీపీ ప్రభుత్వం పూర్తిగా తమను వంచించిందని, కానీ కూటమి ప్రభుత్వంపై తాము ఆశలు పెట్టుకున్నామని కౌలు రైతులు చెబుతున్నారు. సీసీఆర్‌సీ కార్డులు అందించే విషయంలో చొరవ చూపిన ప్రభుత్వం వాటి ద్వారా అందించే రుణాల విషయంలో బ్యాంకర్ల నుంచి పూర్తి స్థాయిలో సహకారం తీసుకోవడంలో విఫలమైందని కౌలు రైతాంగం ఆరోపిస్తోంది. ఇప్పటికైనా జిల్లాల వారీగా కౌలు రైతులకు అందించిన రుణాల లెక్కలను జిల్లా కలెక్టర్లు సమీక్షిస్తే రుణ పద్దు కేటాయింపుల్లో తమకు ఏ స్థాయిలో అన్యాయం జరిగిందో అర్థమవుతుందని కౌలు రైతులు చెబుతున్నారు.

కూటమిలో.. కిలారి చిచ్చు





- అతని అక్రమాలపై అప్పట్లో స్వపక్షంలో, విపక్షంలోనూ రచ్చ
- ఒక వైపు దర్యాప్తు జరుగుతుండగా జనసేనలో చేరే ప్రయత్నం
- కోపంతో రగిలిపోతున్న ఎమ్మెల్యే నరేంద్ర వర్గీయులు
- కేంద్ర మంత్రి పెమ్మసాని అనుయాయుల్లో విస్మయం
- ఇదే తరహాలో కొందరు బీజేపీలో చేరే ప్రయత్నం
- ఇటువంటి వారి విషయంలో ఆచితూచి వ్యవహరించకపోతే కూటమికి అప్రతిష్టే..

గుంటూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ళ వైసీపీ పాలనలో సీఎం జగన్‌తో అంటకాగి పొన్నూరు నియోజకవర్గం అడ్డాగా రూ. వందల కోట్ల దోపిడీకి పాల్పడ్డాడనే ఆరోపణలకు గురైన మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య కూటమిలో భాగమైన జనసేనలో చేరేందుకు ప్రయత్నిస్తున్నాడనే వార్తలను ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులు జీర్ణించుకోలేకపోతున్నారు. అక్రమ క్వారీయింగ్‌లతో రూ. వందల కోట్లు దోపిడీకి పాల్పడ్డాడని అప్పట్లో పొన్నూరు నియోజకవర్గానికి చెందిన సొంత పార్టీ నేతలే రోడ్డెక్కి యాగీ చేసిన విషయం తెలిసిందే. ఆనాడు ప్రతిపక్ష నేతగా ఉన్న ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ పలు మార్లు కిలారి దోపిడీని సాక్ష్యాలతో ఎండగట్టటం జరిగింది. అక్షరాల 700 ఎకరాల్లో అక్రమ క్వారీయింగ్ అప్పటి ఎమ్మెల్యే రోశయ్య కనుసన్నల్లోనే జరగటాన్ని కేజీఎఫ్ తరహా దోపిడీగా అభివర్ణించారు. ఒక్క అక్రమ క్వారీయింగే కాకుండా ఉద్యోగుల పోస్టింగ్‌ల సమయంలో పెద్ద ఎత్తున డబ్బులు తీసుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. అంత వరకైతే పర్వాలా ఆ మండలంలో పనిచేసే ఎస్‌ఐలు, సీఐలు, తహశీల్దార్‌లకు సైతం నెల నెలా ఇండెంట్ పెట్టి వసూలు చేశారని కూడా ఏకంగా కొందరు అధికారులే రచ్చకెక్కారు. తన మాట వినని అధికారులను సస్పెండ్ చేయించటం వంటి చర్యలకు కూడా కిలారి పాల్పడినట్లు అప్పట్లో ఆధారాలు ఉన్నాయి. ఏకంగా ఓ తహశీల్దార్‌ను అయితే అతని దోపిడీకి సహకరించటం లేదని సస్పెండ్ చేయించారు. చివరకు ఆయన న్యాయస్థానంలో పోరాటం ద్వారా తిరిగి తన పదవిని కాపాడుకున్నారు. ఒక దశలో పొన్నూరు నియోజకవర్గంలో ఉద్యోగం చేయాలంటే అధికారులు వణికిపోయారు.

రోశయ్య హయాంలో పొన్నూరులో వైసీపీ ఎంత పతనావస్థకు చేరిందంటే ఆ సీటును అడిగేందుకు ఎవరూ ముందుకు రాకపోవటమే తార్కాణం. ఇంత అప్రతిష్ట రోశయ్య కూడగట్టుకోవటం మూలంగానే తిరిగి అతనికి సీటిస్తే పొన్నూరులో ఓటమి ఖాయమని భావించే అతన్ని అక్కడ నుంచి తప్పించారు. ఆ తరువాత గుంటూరు ఎంపీగా కూడా ఆయనను తప్పనిసరి పరిస్థితుల్లోనే బరిలోకి దించారు. అతని బావ ఉమ్మారెడ్డి వెంకటరమణకు తొలుత ఎంపీ సీటును ఇవ్వగా ఆయన కొద్ది రోజులకే పోటీకి నిరాకరించి తప్పుకున్నారు. అప్పటికే టీడీపీ ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగిన పెమ్మసాని చంద్రశేఖర్‌ను తట్టుకొని నిలబడేందుకు ఎవరూ ముందుకు రాకపోవటంతో కిలారి రోశయ్యను బరిలోకి దించారు.

జగన్ వత్తిడితో ఎంపీ బరిలోకి దిగిన కిలారి గెలుపు కోసం పది శాతం కూడా ప్రయత్నం చేయలేదు. గెలవనని ముందుగానే నిర్ణయించుకోవటంతో పార్టీ ఇచ్చిన ఫండ్ మినహా సొంత డబ్బు రూపాయి కూడా ఖర్చు చేయలేదు. ఆ ఎన్నికల్లో మూడు న్నర లక్షలకు పైగా ఓట్ల తేడాతో ఘోర పరాజయాన్ని కిలారి చవి చూశారు. కొద్ది రోజుల క్రితం వైసీపీకి రాజీనామా చేస్తు న్నట్లు ప్రకటించారు. వాస్తవానికి జగన్ హయాంలో పొన్నూరులో ఆయన చేసిన అరాచకాలపై ప్రస్తుత ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆధారాలతో సహా అధికారులకు అందించటంతో దర్యాప్తు మొదలైంది. ఈ కేసుల నుంచి తప్పించుకునేందుకే ఆయన కూటమి గొడుకు కిందకి చేరే ప్రయత్నం ప్రారంభించాడు. టీడీపీలో ఎటువంటి పరిస్థితుల్లో చేర్చుకోరని నిర్ణయించుకొని తన సామాజికవర్గం నేతల ఆసరాతో జనసేనలో చేరే ప్రయత్నం ముమ్మరం చేశారు. రెండు రోజుల క్రితం జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను కూడా మర్యాద పూర్వకంగా కిలారి కలిసి వచ్చిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన తన అనుయాయులతో త్వరలో తాను జనసేనలో చేరబోతున్నట్టు తద్వారా తిరిగి తాము అధికార పార్టీ గొడుగు కిందకు చేరుతున్నామని ధీమా వ్యక్తం చేసినట్లు తెలిసింది. దీంతో టీడీపీ శ్రేణుల్లో ఆగ్రహం వ్యక్తమవుతున్నది. ముఖ్యంగా పొన్నూరు నుంచి ఆరు పర్యాయాలు గెలిచి ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్న ధూళిపాళ్ళ నరేంద్ర వర్గీయులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పాడి రైతులకు ఎంతో వెన్నుదన్నుగా ఉన్న సంగం డెయిరీని మూత వేయించేందుకు అప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న కిలారి రోశయ్య చేసిన ప్రయత్నాలను నరేంద్ర అనుయాయులు గుర్తుచేస్తున్నారు. 2019 ఎన్నికల్లో వైసీపీ గాలిలో గెలిచి ఒక్క మారు గెలిచినందుకే రోశయ్య ఎంతో విర్రవీగి టీడీపీ శ్రేణులపై పొన్నూరు నియోజకవర్గంలో ఎన్నో అక్రమ కేసులు బనాయించిన విషయాలను కూడా వారు మరిచిపోలేకపోతున్నారు. అటువంటి నేతను కూటమిలో భాగమైన జనసేనలో చేర్చుకుంటే కలిసి మెలిసి తిరగటం ఎలా సాధ్యమవుతుందని వారు ప్రశ్నిస్తున్నారు. కాగా ఇప్పటి వరకు రోశయ్యను చేర్చుకునే విషయంలో కూటమి నేతలు ఎవరూ కూడా తమ ఎమ్మెల్యే నరేంద్రను సంప్రదించలేదని ఆయన అనుయాయులు వాపోతున్నారు. గత ఎన్నికల్లో వైసీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన రోశయ్య పెమ్మసాని చంద్రశేఖర్ చేతిలో ఓడిపోయిన విషయం తెలిసిందే. రోశయ్య చేరికపై పెమ్మసానిని కూడా సంప్రదించలేదని ఆయన అనుయాయులు మండిపడుతున్నారు. సొంత పనిపై అమెరికా వెళ్ళిన నరేంద్ర ఒక వారంలో తిరిగి రానున్నారు. అదే విధంగా ప్రస్తుతం కేంద్ర మంత్రిగా వ్యవహరిస్తున్న పెమ్మసాని చంద్రశేఖర్ కూడా సొంత పనిపై అమెరికా వెళ్ళటం జరిగింది. వీరిద్దరూ ఈ నెలాఖరులో రానున్నారు. వచ్చాక వారి స్పందన ఏమిటో వెల్లడి కానున్నది.

అంగన్‌వాడీల్లో.. ఉడకని పప్పు



- నామమాత్రంగా సరఫరా
- పౌష్టికాహారంలోనూ కోత

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి) అంగన్‌వాడీలకు కందిపప్పు సరఫరాలో నిర్లక్ష్య వైఖరి కనిపిస్తోంది. ఈ నెలలో ఒక్క కేంద్రానికి కూడా కందిపప్పు సరఫరా చేయలేదు. పౌరసరఫరాల శాఖ నిర్లక్ష్యం చిన్నారులు, గర్భిణులకు శాపంగా మారుతోంది. సదరు కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించని కారణంగా సరఫరా నిలిచిపోయిందని చెబుతున్నారు. కందిపప్పు సరఫరా నిలిచిపోవడంతో పప్పు అందకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకున్న బాలింతలు, గర్భిణులకు నెలకు కిలో కందిపప్పు చొప్పున ఇవ్వాలి. సరఫరా నిలిచిపోవడంతో వారు మార్కెట్‌లో కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ 170 నుంచి 180 వరకు ధర ఉంది. దీంతో వారిపై ఆర్థిక భారం పడుతోంది. 3 నుంచి 6 ఏళ్లలోపు పిల్లలుకు నిత్యం 15 గ్రాముల కందిపప్పు ఇవ్వాలి. దీంతో చాలా చోట్ల పప్పు లేకుండానే మెనూ లాగించేస్తున్నారు.

పల్నాడు, బాపట్ల, గుంటూరు, జిలాల్లో 5,401 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటిలో 2,30,690 మంది లబ్ధిదారులు ఉన్నారు. కేంద్రాలకు వచ్చే గర్భిణులు బాలింతలు పిల్లలకు మధ్యాహ్న భోజనం కింద సోమవారం నుంచి శనివారం వరకు పప్పు తప్పనిసరిగా వండాల్సి ఉంది. సరఫరా నిలిచిపోవడంతో సిబ్బందికి ఇబ్బందులు తప్పడంలేదు. ఆగస్టు నెలకు అరకొరగా కందిపప్పు సరఫరా చేశారు. సెప్టెంబరు నెలకు కందిపప్పు నేటికీ సరఫరా కాలేదు. ఉమ్మడి గుంటూరు జిల్లాల్లో కందిపప్పు పంపిణీ దాదాపుగా నిలిచిపోయింది. ఆగస్టు నెలకు సంబంధించి అరకొరగా సరఫరా చేయగా, సెప్టెంబరు నెలకు నేటి వరకు కందిపప్పు సరఫరా చేయలేదు. పల్నాడు జిల్లాలో 2032 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. 1,37,523 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో బాలింతలు,గర్భిణులు 12,945 మంది, ఆరు నెలల నుంచి 3 ఏళ్ల లోపు పిల్లలు 60,540, 3 నుంచి 6 ఏళ్ల లోపు పిల్లలు 51,739, ఆరు నెలల లోపు చిన్నారులు 7,184 మంది కేంద్రాల్లో నమోదయ్యారు. బాపట్లలో 1,889 అంగన్‌వాడీ కేంద్రాల్లో 81,293 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో గర్భిణులు, బాలింతలు 9,019, 6 నెలల నుంచి 3 ఏళ్లలోపు పిల్లలు 36,693, 3 నుంచి 6 ఏళ్లలోపు పిల్లలు 26,684, ఆరు నెలల లోపు చిన్నారులు 5,399 మంది ఉన్నారు. గుంటూరు జిల్లాలో 1,480 అంగన్‌వాడీ కేంద్రాల్లో 1,18,747 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో గర్భిణులు, బాలింతలు 10,648 మంది, 6 నెలల నుంచి 3 ఏళ్లలోపు పిల్లలు 49,194, 3 నుంచి 6 ఏళ్లలోపు పిల్లలు 49,269, ఆరు నెలల లోపు చిన్నారులు 5,609 మంది ఉన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

కందిపప్పు సరఫరా ఇలా..

అంగన్‌వాడీ కేంద్రాలకు ఆగస్టు నెలలో కందిపప్పు పంపిణీని పౌరసరఫరా లెక్కల ప్రకారం పరిశీలిస్తే అరకొరగా సరఫరా చేసినట్టు అర్థమవుతోంది. పల్నాడు జిల్లాలో 33,506 కేజీ ప్యాకెట్‌ల కందిపప్పు పంపిణీ చేయాల్సి ఉండగా 7,274 ప్యాకెట్‌లు మాత్రమే పంపిణీ చేశారు. బాపట్ల జిల్లాలో 19,409 ప్యాకెట్‌లకు 7,552 ప్యాకెట్‌లు, గుంటూరు జిల్లాలో 26,314 ప్యాకెట్‌లకు గాను 9,897 ప్యాకెట్‌ల కందిపప్పు పంపిణీ చేసినట్టు సదరు శాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి. పల్నాడు జిల్లాలో ఎనిమిది, బాపట్ల జిల్లాలో మూడు, గుంటూరు జిల్లాలో మూడు మండలాలకు ఒక్క ప్యాకెట్ కందిపప్పు ఇవ్వలేదు. జూలై నెలలో కూడా అరకొరగానే సరఫరా జరిగింది. మూడు నెలలుగా తమ కేంద్రానికి కందిపప్పు ఇవ్వలేదని లింగంగుంట్ల కేంద్రం సిబ్బంది తెలిపారు. సెప్టెంబరు నెలకు సంబంధించి కందిపప్పు సరఫరా కాలేదని పౌరసరఫరాల శాఖ గణంకాలు చెబుతున్నాయి. ఇప్పటికైనా అంగన్‌వాడీలకు కందిపప్పు అందించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

---

42 మంది ఎంపీడీఓలు బదిలీ

పక్క జిల్లాల నుంచి వచ్చిన 16 మందికి ఇక్కడ పోస్టింగ్



గుంటూరు సిటీ, సెప్టెంబరు 23 : ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 42 మంది మండల పరిషత్ అభివృద్ధి అధికారుల(ఎంపీడీఓ)ను బదిలీ చేస్తూ జిల్లా పరిషత్ చైర్ పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, ఇంచార్జి సీఈఓ మోహన్ రావు ఉత్తర్వులు జారీచేశారు. ఆదివారం అర్ధ రాత్రి కి ఎంపీడీఓల బదిలీల తుదిజాబితా రూపుదిద్దుకుంది. మండలాల వారీగా బదిలీ అయిన ఎంపీడీవోల వివరాలు ఇలా ఉన్నాయి. పీజే విలియమ్స్ (ముప్పాళ్ళ)షేక్ మహబూబ్ సుభాని (చెరుకుపల్లి) జీ కాశియ్య(నకరికల్లు)ఏ శ్రీనివాసరావు (దుగ్గిరాల) ఐ సత్యనారాయణ (పిట్టలవానిపాలెం) కే శివ పార్వతి(ప్రత్తిపాడు) పీ ఉమాదేవి (కారంపూడి) కే నరసింహారావు (కొల్లూరు) కే సమతా వాణి (తాడికొండ) ఎం శోభారాణి (రేపల్లె) వై హనుమారెడ్డి (బెల్లంకొండ) కే సరోజినీ దేవి (రెంటచింత) ఫణి కుమార్ నాయక్ (మాచర్ల) వి విజయలక్ష్మి (కొల్లిపర) టీ సుగుణమ్మ (మంగళగిరి) పీ పుట్టారెడ్డి (దుర్గి) జి విసత్యనారాయణ (రాజుపాలెం) పి రామకృష్ణ (పెదకూరపాడు)ఎస్ వెంకటేశ్వరరావు (ఫిరంగిపురం) బీ శ్రీనివాస్ రెడ్డి (సత్తెనపల్లి) జీ చంద్రశేఖర రావు (పొన్నూరు) టీ మారుతి శేషాంబ (అమృతలూరు) బీ శివన్నారాయణ (వేమూరు) కే ప్రభాకర్‌రావు (నాదెండ్ల)ఏ దీప్తి(తెనాలి)టీ బాబూరావు (బాపట్ల)ఆర్ శ్రీనివాసరావు (పెదకాకాని)కే శ్రీనివాసరావు (అచ్చంపేట) ఎం రమేష్ బాబు (వట్టిచెరుకూరు) వీ రమణ (భట్టిప్రోలు) కానూరి శిల్ప (తుళ్లూరు) జి లక్ష్మీదేవి (పెదనందిపాడు) కే లలిత(చేబ్రోలు) టీ చందన (మేడికొండూరు) యుగ కీర్తి (కాకుమాను)ఎస్ సుదీప (చుండూరు) వి హేమలతాదేవి (యడ్లపాడు) టీ పార్వతి (అమరావతి) సీహెచ్ రామచంద్రరావు (పిడుగురాళ్ల) బండ్ల శ్రీనివాసరావు (గుంటూరు రూరల్) తోట వెంకట కృష్ణకుమారి (నరసరావుపేట) ఏ శ్రీనివాసరావు(కర్లపాలెం) ఎంపీడీవోలుగా నియమితులయ్యారు. బదిలీ ఉత్తర్వు లను ఎంపీడీఓలు సోమవారం అందుకున్నారు.మరికొందరు వెంటనే విధుల్లో చేరారు.

పొలం పిలుస్తోంది పోస్టర్ ఆవిష్కరణ

బాపట్ల, సెప్టెంబరు 23 : పొలం పిలుస్తుంది పోస్టర్‌ను కలెక్టర్ జె.వెంకటమురళి, జిల్లా స్థాయి అధికారులు సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొలం పిలుస్తుంది కార్యక్రమం వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకేనన్నారు. ప్రతి మంగళ, బుధవారాలలో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రజాప్రతినిధుల పొలంబాట, పంటసాగుపై చర్చలు ఉంటాయని తెలిపారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటమురళి తదితరులు



ఇంకో 75 రోజుల్లో పుష్ప రూల్

'పుష్ప ద రూల్'.. భారతీయ సినీపరిశ్రమ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న సినిమా ఇది. అల్లు అర్జున్ నటిస్తున్న ఈ ప్రతిష్ఠాత్మక చిత్రం మరో 75 రోజుల్లో అంటే డిసెంబర్ 6న విడుదల కానుంది. అంటే పుష్ప రూల్‌కు కౌంట్ డౌన్ మొదలైందన్నమాట. అల్లు అర్జున్ నటన కోసం, దర్శకుడు సుకుమార్ టేకింగ్, మేకింగ్ కోసం అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం చివరి దశలో ఉంది. మరోవైపు నిర్మాణానంతర కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. కంటెంట్ పరంగానే కాకుండా సాంకేతికంగా కూడా ఈ సినిమా అత్యున్నత స్థాయిలో ఉంటుందని నిర్మాతలు నవీన్ యర్నేని, రవిశంకర్ చెప్పారు. ఇప్పటికే విడుదలైన రెండు పాటలకు, టీజర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చిందనీ, ఇక వచ్చే ప్రతి ప్రమోషనల్ కంటెంట్ అదిరిపోయే రీతిలో ఉంటుందని వారు తెలిపారు. రశ్మిక కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో ఫహాద్ ఫాజిల్ కీలక పాత్ర పోషిస్తున్నారు.

టిక్కెట్ ధర పెంపునకు ప్రభుత్వ అనుమతి



జూనియర్ ఎన్టీఆర్, జాన్వీ కపూర్ జంటగా నటిస్తున్న దేవర సినిమా ఈ నెల 27న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో తెలంగాణలో దేవర సినిమా టిక్కెట్ల ధరలు పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. అంతేకాదు మిడ్ నైట్ షోలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. మిడ్ నైట్ షోలు ఆడించేందుకు 29 థియేటర్లకు అనుమతించింది. ఈ మేరకు హోం శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రవిగుప్తా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సినిమా రిలీజ్ రోజున ఆరు షోలు ఆడించేందుకు థియేటర్లకు అనుమతి ఇచ్చారు. మరుసటి రోజు నుంచి అక్టోబరు 6 వరకు రోజుకు 5 షోలు ఆడించుకునే వెసులు బాటు కల్పించారు. తొలిరోజు టిక్కెట్ ధరలను రూ. 100 పెంచుకునేందుకు అనుమతించారు. సింగిల్ స్క్రీన్‌లలో టిక్కెట్‌పై రూ. 25, మల్టీప్లెక్స్‌లో రూ. 50 పెంచుకునే అవకాశం కల్పించారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ ఈ సినిమాకు టికెట్ రేటు పెంచే సదుపాయం అక్కడి ప్రభుత్వం కల్పించిన సంగతి విదితమే.

అమెరికా వెళ్లిన ఎన్టీఆర్

జూనియర్ ఎన్టీఆర్ తన సతీమణి ప్రణతీతో కలసి అమెరికా బయలుదేరారు. లాస్‌ఏంజిల్స్‌లోని బియాండ్‌ఫెస్ట్‌లో ఈ నెల 26 సాయంత్రం జరిగే దేవర స్క్రీనింగ్‌కి హాజరు కానున్నారు. అలాగే అక్కడ కొన్ని మీడియా సంస్థలకు ఇంటర్వ్యూలు ఇవ్వనున్నారు.




మహేశ్‌బాబు, నమ్రత శిరోద్కర్ సోమవారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. వరద బాధితుల సహాయార్థం ప్రకటించిన రూ.50 లక్షల చెక్కును సీఎంకు అందజేశారు. అలాగే ఎ.ఎమ్.బి తరఫున మరో రూ. 10లక్షల చెక్కును కూడా మహేశ్‌బాబు అందజేశారు

సెట్‌లో దర్శకుడి బర్త్ డే



సిద్ధు జొన్నలగడ్డ హీరోగా బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'జాక్'. 'కొంచెం క్రాక్' అనేది ట్యాగ్ లైన్. సీనియర్ ప్రొడ్యూసర్ బి.వి.ఎస్.ఎన్. ప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం నేపాల్‌లో జరుగుతోంది. ఇప్పటికి ఎనభై శాతం చిత్రం పూర్తయిందనీ, ఫ్రెష్ కామెడీతో లాఫింగ్ రైడ్‌లా సినిమా ఉంటుందని నిర్మాత చెప్పారు. సోమవారం దర్శకుడు భాస్కర్ పుట్టినరోజు కావడంతో సెట్‌లో సెలబ్రేట్ చేశారు. ప్రకాశ్‌రాజ్, హీరోయిన్ వైష్ణవి తదితరులు కూడా పాల్గొన్నారు.

చారిత్రక యోధుడి పాత్రలో తొలిసారి!



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్ మళ్లీ ముఖానికి మేకప్ వేసుకుని కెమెరా ముందుకు వచ్చారు. ఆయన తొలిసారిగా చారిత్రక యోధుడి పాత్ర పోషిస్తున్న 'హరి హర వీరమల్లు' సినిమా తాజా షెడ్యూల్ సోమవారం ఉదయం విజయవాడలో మొదలైంది. కళా దర్శకుడు తోట తరణి రూపొందించిన భారీ సెట్‌లో యుద్ధ సన్నివేశాన్ని దర్శకుడు జ్యోతికృష్ణ చిత్రీకరిస్తున్నారు. హాలీవుడ్ యాక్షన్ డైరెక్టర్ నిక్ పావెల్ సారథ్యంలో జరుగుతున్న ఈ చిత్రీకరణలో నాజర్, రఘుబాబు, అయ్యప్ప పి.శర్మ, సునీల్ తదితరులతో పాటు ఫైటర్లు, జూనియర్ ఆర్టిస్టులు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు. నిధి అగర్వాల్ చిత్ర కథానాయిక కాగా, బాలీవుడ్ నటులు బాబీ డియోల్, అనుపమ్ ఖేర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.వచ్చే ఏడాది మార్చి 28న 'హరిహర వీరమల్లు' పార్ట్ వన్ విడుదలవుతుందని వెల్లడిస్తూ ఓ పోస్టర్‌ను విడుదల చేశారు. పవన్‌కల్యాణ్‌ను సరికొత్తగా చూడబోతున్నామని ఈ పోస్టర్‌తో హామీ ఇచ్చారు దర్శకనిర్మాతలు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో విడుదలయ్యే ఈ చిత్రాన్ని ఎ.ఎం.రత్నం సమర్పణలో ఎ.దయాకరరావు చెప్పారు,

ఆ వీధికి నాన్న పేరు పెట్టండి

స్టాలిన్‌కు ఎస్పీ చరణ్ వినతి



గానగంధర్వుడు, సినీ నేపథ్యగాయకుడు దివంగత ఎస్.పి.బాలసుబ్రమణ్యం నివసించిన కామ్‌దార్‌నగర్‌కు ఆయన పేరును పెట్టాలని ఎస్పీబీ తనయుడు, సినీ నేపథ్యగాయకుడు ఎస్పీ .చరణ్ కోరారు. ఈ మేరకు ఆయన సోమవారం చెన్నై సచివాలయం ప్రాంగణంలో ఉన్న ముఖ్యమంత్రి స్టాలిన్ సెల్‌లో వినతిపత్రం సమర్పించారు. ఇందులో.. 'సంగీత ప్రపంచంలో తన మధురమైన గాత్రంతో కోట్లాదిమంది అభిమానుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన గాయకుడు ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం జీవించివున్న సమయంలో స్థానిక నుంగంబాక్కంలోని కామ్‌దార్‌నగర్‌లో తన కుటుంబ సభ్యులతో కలిసివుండేవారు. ప్రస్తుతం ఆయన భౌతికంగా లేకపోవడంతో ఆయనను స్మరించుకునేలా ఎస్పీబీ నివసించిన కామ్‌దార్‌నగర్‌కు 'ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం నగర్ లేదా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వీధి'గా నామకరణం చేయాలని కోరుతున్నాను. ఈ వినతిని పెద్దమనసుతో అంగీకరించి, తమతో పాటు కోట్లాదిమంది ఎస్పీబీ అభిమానుల కోరికను తీర్చాలని కోరుతున్నాం' అని ఎస్పీ చరణ్ కోరారు. కాగా, ఈ నెల 25వ తేదీన ఎస్పీబీ నాలుగో వర్థంతి వేడుకలు జరుగనున్న విషయం తెల్సిందే.

- చెన్నై(ఆంధ్రజ్యోతి)

ఆస్కార్‌కి వెళ్తున్న లాపతా లేడీస్

వచ్చే ఏడాది జరిగే ఆస్కార్ అవార్డుల వేడుకకు ఇండియా నుంచి వెళ్లే సినిమా ఖరారైపోయింది. ఆ చిత్రమే.. బాలీవుడ్ నటుడు అమీర్ ఖాన్ మాజీ భార్య.. 'ధోబీ ఘాట్' ఫేమ్ కిరణ్ రావు దర్శకత్వం వహించిన 'లాపతా లేడీస్'. 2025 సంవత్సరానికిగాను ఉత్తమ విదేశీ చిత్రాల జాబితాలో మన దేశం నుంచి అధికారిక ఎంట్రీగా 'లాపతా లేడీస్' చిత్రాన్ని నామినేట్ చేస్తున్నట్టు ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎఫ్ఐ) ఛైర్మన్ జహ్నూ బారువా ఇతర నిర్వాహకులు రవి కొట్టార్కర, సి.కళ్యాణ్ తదితరులతో కలసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఈ ఏడాది ఆస్కార్ నామినేషన్ల కోసం తెలుగు, తమిళం, మలయాళం, మరాఠీ, హిందీ భాషలకు చెందిన 29 చిత్రాలను 13 మందితో కూడిన కమిటీ సభ్యులు షార్ట్‌లిస్ట్‌చేయగా, అందులో 'లాపతా లేడీస్'ను అధికారిక ఎంట్రీగా సభ్యులంతా ఎంపిక చేసినట్టు జహ్నూ బారువా వెల్లడించారు. కాగా, మార్చి ఒకటిన విడుదలైన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సొంతం చేసుకుంది. ఇప్పటికే పలు ప్రతిష్ఠాత్మక అవార్డులనూ పొందింది.



అలాగే, భారతదేశ అత్యున్నత న్యాయస్థానం 75వ వార్షికోత్సవాల్లోనూ ఆ చిత్రాన్ని ప్రదర్శించడం విశేషం. కొత్తగా పెళ్లైన ఓ గ్రామీణ జంట జీవితాల్లో జరిగిన అనూహ్య సంఘటనల ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించారు. వారు ఎదుర్కొన్న అనేక సమస్యలను ఇందులో మనసుకు హత్తుకునేలా తెరకెక్కించడమే ఈ చిత్ర విజయానికి కారణం. ఈ సినిమాతో పాటు తెలుగు చిత్రసీమ నుంచి 'కల్కి 2898 ఏ.డీ', 'హను-మాన్', 'మంగళవారం' చిత్రాలు.. బాలీవుడ్ నుంచి 'యానిమల్', 'కిల్', 'శ్రీకాంత్', 'ఆర్టికల్ 370', 'మైదాన్'.. మలయాళం నుంచి నేషనల్ అవార్డ్ విన్నర్ "ఆట్టమ్', 'ఆడు జీవితమ్', 'ఆల్ వియ్ ఇమాజిన్ ఆజ్ లైట్'.. తమిళ్ నుంచి 'వాజీ', 'మహరాజా' వంటి 29 చిత్రాలు పోటీ పడ్డాయి.

నమ్మకం నిజమైంది

'లాపతా లేడీస్' ఆస్కార్‌కు ఎంపికైనందుకు దర్శకురాలు కిరణ్ రావు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "ఈ చిత్రం ఆస్కార్‌కు నామినేట్ అవుతుందని ఇంతకుముందే ఓ ఇంటర్వ్యూలో చెప్పాను. నా నమ్మకం నిజమైంది. సినిమా కోసం అహర్నిశలు శ్రమించిన మా చిత్రబృందానికి దక్కిన గుర్తింపు ఇది. భారత్‌లో ఈ సినిమాను ఎలా ఆదరించారో.. అంతర్జాతీయంగానూ అంతే ఆదరిస్తారని ఆశిస్తున్నాను" అని అన్నారు.




అన్నయ్య హగ్ చేసుకున్నాడు



తమిళ నటుడు కార్తీ నటించిన తాజా చిత్రం 'సత్యమ్ సుందరమ్'. '96' ఫేమ్ సి.ప్రేమ్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాను సూర్య, జ్యోతిక నిర్మించారు. అరవింద స్వామి కీలక పాత్ర పోషించారు. ఈ నెల 28న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా హీరో కార్తీ మీడియాతో ముచ్చటించారు.

"ఈ సినిమా స్క్రిప్ట్‌ను చదవగానే నా కళ్ల వెంట ఆనందభాష్పాలు వచ్చాయి. అద్భుతమైన మానవ విలువలు ఉన్న కథ ఇది. ఈ కథను మొదట దర్శకుడు నవలగా తీసుకువద్దామని రాసుకున్నారు. అదృష్టవశాత్తు ఇది సినిమాగా తెరకెక్కింది. ఇందులో నాది అమాయకత్వం.. చలాకీతనం కలగలసిన క్యారెక్టర్. సున్నితమైన భావోద్వేగాలతో నిండిన ఫీల్ గుడ్ చిత్రమిది. నా పాత్ర, అరవింద స్వామి పాత్ర గుర్తుండిపోతాయి. '96' చిత్రంలాగే.. ఈ సినిమా కథ కూడా ఒక్క రాత్రిలోనే జరుగుతుంది. గ్రామీణ జీవితాన్ని.. మన సంప్రదాయాల్ని.. మూలాల్ని తిరిగి గుర్తుచేసేలా ఉండే ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది. గోవింద్ వసంత్ అందించిన మ్యూజిక్ చాలా వినసొంపుగా ఉంటుంది. ప్రతీ పాట అర్థవంతంగా ఉండి హృదయాల్ని కదిలిస్తుంది. ప్రేక్షకులకు రియల్ ఎమోషన్స్‌ను పరిచయం చేసే ఇలాంటి చిత్రాలు రావడం చాలా అరుదు. ఈ సినిమాను చూసిన అన్నయ్య సూర్య చేసుకుని హగ్ చేసుకుని ప్రశంసించారు. నా మొదటి సినిమా తర్వాత ఇన్నేళ్లకు అన్నయ్య అంతలా ఎక్సైట్ అయిన చిత్రమిదే" అని చెప్పారు.



సంక్రాంతి బరిలో మరో సినిమా



వచ్చే సంక్రాంతికి విడుదలయ్యే సినిమాల జాబితాలో మరో పేరు చేరింది. సందీప్‌కిషన్ హీరోగా నటిస్తున్న 30వ సినిమా అది. ఈ చిత్రానికి 'మజాకా' అనే పేరు నిర్ణయించారు. త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో రాజేశ్ దండా ఈ సినిమా నిర్మిస్తున్నారు. ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్, రిలీజ్ టైమ్ ఒకేసారి విడుదల చేసి ప్రమోషన్స్ ప్రారంభించారు నిర్మాత.

ఇన్ ప్రోగ్రెస్



నీ జతగా

ప్రముఖ రచయిత పరుచూరి వెంకటేశ్వరరావు మనవడు సుదర్శన్ హీరోగా నటిస్తున్న 'మిస్టర్ సెలెబ్రిటీ' చిత్రంలోని మెలోడీ సాంగ్‌ను హీరో గోపీచంద్ విడుదల చేసి కొత్త హీరోకు, యూనిట్‌కు అభినందనలు తెలిపారు. 'నీ జతగా' అంటూ సాగే ఈ పాటను గణేశా రచించగా, జావెద్ అలీ పాడారు. వినోద్ యాజమాన్య సంగీత దర్శకుడు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. చందిన రవికిశోర్ దర్శకత్వంలో చిన్న రెడ్డయ్య, ఎన్.పాండురంగారావు ఈ సినిమాను నిర్మించారు.

కుతంత్రమే ఆమె మంత్రం



విష్ణు మంచు హీరోగా డాక్టర్ మోహన్‌బాబు నిర్మిస్తున్న 'కన్నప్ప' చిత్రం నుంచి నటి ఐశ్వర్య పోషిస్తున్న మారెమ్మ పాత్రకు సంబంధించిన లుక్‌ను సోమవారం విడుదల చేశారు. అందరినీ భయపెట్టే విధంగా ఈ లుక్ ఉంది. 'అడవిని పీడించే అరాచకం.. మారెమ్మ, కుతంత్రమే ఆమె మంత్రం' అంటూ రిలీజ్ చేసిన పోస్టర్ అందరినీ ఆకట్టుకునే విధంగా ఉంది. డిసెంబర్‌లో విడుదలయ్యే ఈ పాన్ ఇండియా మూవీకి ముఖేశ్‌కుమార్ సింగ్ దర్శకుడు.

ఏఐ మ్యూజిక్‌తో 'ఐ వాంట్ లవ్'



డైరెక్టర్ ఆర్జీవీ బ్యానర్‌పై గిరి కృష్ణకమల్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'శారీ'. ఈ పాన్ ఇండియా చిత్రాన్ని రవి వర్మ నిర్మిస్తున్నారు. సత్య యాదు, ఆరాధ్య దేవి హీరోహీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రంలోని మొదటి గీతం 'ఐ వాంట్ లవ్'ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ "ఈ సినిమాలోని మొత్తం పాటలను ఏ.ఐను ఉపయోగించే కంపోజ్ చేశాము. నేపథ్య సంగీతానికి కూడా ఏ.ఐతోనే ముందుకు వెళ్తాం. ఇకపై 'ఆర్జీవీ మ్యూజిక్ డెన్' నుంచి వచ్చే ప్రతీ పాటలో ఏ.ఐ యాప్స్‌తో తయారు చేసిన సంగీతం మాత్రమే ఉంటుంది" అని చెప్పారు.

ఐఐటీ తిరుపతిలో ఎంఎస్(రీసెర్చ్), పీహెచ్‌డీ

దిక్సూచి DIKSUCHI



తిరుపతిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ తిరుపతి)- ఎంఎస్(రీసెర్చ్), పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. రిటెన్ టెస్ట్/ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. రెగ్యులర్(ఫుల్ టైమ్ స్కాలర్స్), ఎక్స్‌టర్నల్, పార్ట్ టైమ్ కేటగిరీల్లో అడ్మిషన్స్ ఇస్తారు. రెగ్యులర్ విధానంలో ఎంపికైన అభ్యర్థులకు వివిధ స్కీమ్‌ల ద్వారా అసిస్టెంట్‌షిప్ లభిస్తుంది. ఎక్స్‌టర్నల్, పార్ట్ టైమ్ విధానాల్లో చేరాలనుకునే అభ్యర్థులు ఉద్యోగులై ఉండాలి. కనీసం రెండేళ్ల అనుభవం; రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సంస్థలు/జాతీయ స్థాయి ల్యాబొరేటరీల నుంచి స్పాన్సర్‌షిప్ తప్పనిసరి.

ఎంఎస్(రీసెర్చ్)

విభాగాలు: కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్

అర్హత: ఇంజనీరింగ్/టెక్నాలజీ బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. లేదా సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ(ఎమ్మెస్సీ/ఎంసీఏ)తో పాటు గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. ఐఐటీల నుంచి కనీసం 8 సీజీపీఏతో బీఈ/బీటెక్ పూర్తిచేసినవారు కూడా అర్హులే.

పీహెచ్‌డీ

విభాగాలు: కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, మేథమెటిక్స్ అండ్ స్టాటిస్టిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, ఫిజిక్స్

అర్హత: ఇంజనీరింగ్ విభాగాలకు ఎంఈ/ఎంటెక్/ఎంఎస్ రీసెర్చ్ లేదా ఇంజనీరింగ్‌లో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ మాస్టర్స్ లేదా డ్యూయెల్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 8 సీజీపీఏతో ఐఐటీ నుంచి(జామ్ ద్వారా ప్రవేశం పొంది ఉండాలి) రెండేళ్ల ఎమ్మెస్సీ; సీఎఫ్‌టీఐ సంస్థ నుంచి బీఎస్+ఎంఎ స్(ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్) ఉత్తీర్ణులైన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. సైన్సెస్ విభాగాలకు సెంట్రల్ ఫండెడ్ టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్ నుంచి కనీసం 8 సీజీపీఏతో బీఎస్/బీఈ/బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి. గేట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.

హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్ విభాగాలకు సంబంధిత సబ్జెక్టులో మాస్టర్స్ డిగ్రీ/డ్యూయెల్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. యూజీసీ నెట్ లేదా జేఆర్ఎఫ్/గేట్ స్కోర్ ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీ అభ్యర్థులకు రూ.400; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.200
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 14
- **రిటెన్ టెస్ట్/ఇంటర్వ్యూలు:** నవంబరు 5 నుంచి 18 వరకు
- **క్యాంపస్ రిపోర్టింగ్:** డిసెంబరు 2
- **వెబ్‌సైట్:** https://iittp.ac.in

ఉమ్మడి పరిశోధనలకు ఒప్పందం


అవగాహన పత్రాలు మార్చుకుంటున్న వీసీ నాగభూషణ్ తదితరులు

గుంటూరు (విద్య) సెప్టెంబరు 23: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ, హైదరాబాద్‌లోని ఎస్‌ఈసీ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌ల మధ్య అవగాహన ఒప్పందం కుదిరిందని సోమవారం యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్‌ఈసీ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ విద్యాసాగర్ దొంతినేనితో వర్సిటీ వైస్ చాన్స్‌లర్ కల్నల్, ప్రొఫెసర్ నాగభూషణ్ అవగాహన ఒప్పందానికి సంబంధించిన పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా వర్సిటీ వైస్ చాన్స్‌లర్ మాట్లాడుతూ ఈ ఒప్పందం వలన ఉమ్మడిగా పరిశోధనలు చేయడంతోపాటు డెవలప్‌మెంట్ ప్రాజెక్టులను సులభతరం చేయవచ్చని తెలిపారు. ప్రస్తుతం పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడం, వాటికి వినూత్న పరిష్కారాలను అభివృద్ధి చేయడంలో ఉమ్మడిగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ ఎంఎస్ రఘునాథన్, వర్సిటీలోని ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

క్వారీ గుంతలో పడి కౌలు రైతు మృతి


మృతుడు శ్రీను

దుర్గి, సెప్టెంబరు 23: ప్రమాదవశాత్తూ క్వారీ గుంతలో పడి కౌలు రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని తేరాలలో చోటుచేసుకుంది. తేరాల గ్రామానికి చెందిన కోడలి శ్రీను (35) మూడెకరాలను కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. పొలానికి సమీపంలో ఉన్న క్వారీ గుంతలోని నీటిని పొలానికి పెడుతూ ఉంటాడు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మోటారు క్వారీ నీటిలో మునిగిపోయింది. సోమవారం ఎద్దుల బండికి తాడు కట్టి నీటిలో నుంచి మోటారును బయటకు లాగేందుకు ప్రయత్నిస్తుండగా తాడు తెగిపోవడంతో ప్రమాదవశాత్తూ శ్రీను క్వారీ గుంతలో పడిపోయాడు. స్థానికులు మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుని భార్య కుమారి ఫిర్యాదు మేరకు ఎస్ఐ సుధీర్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పింఛన్ మంజూరు చేసి ఆదుకోవాలి

- ప్రజాదర్బార్‌లో వినతులు
- సమస్యలు పరిష్కరిస్తానని లోకేశ్ హామీ


దివ్యాంగులతో మాట్లాడుతున్న నారా లోకేశ్

తాడేపల్లి, సెప్టెంబరు 23: ఉండవల్లి ప్రజాదర్బార్‌లో 35వ రోజు వినతి పత్రాలు అందించేందుకు, మంత్రి లోకేశ్‌ను కలిసి తమ సమస్యలు చెప్పుకునేందుకు భారీగా ప్రజలు తరలి వచ్చారు. అందరి సమస్యలు విన్న లోకేశ్ పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో అర్జీదారులు సంతృప్తి చెందారు.

మంగళగిరి నియోజకవర్గం నుంచి..

మంగళగిరి నియోజకవర్గం నుంచి మంత్రి లోకేశ్‌కు పలువురు సమస్యలతో కూడిన అర్జీలు అందించారు. దివ్యాంగురాలినైన తనకు పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని తాడేపల్లికి చెందిన కె.విజయలక్ష్మి విజ్ఞప్తి చేశారు. రెండు కిడ్నీలు పాడైపోయిన తనకు డయాలసిస్ కోసం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలని మంగళగిరికి చెందిన సంగా నాగేంద్రబాబు కోరారు. డిప్లొమో చదివిన తన కుమారుడికి ఉద్యోగ అవకాశం కల్పించాలని మంగళగిరి రత్నాలచెరువుకు చెందిన సూర్యనారయణ విజ్ఞప్తి చేశారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిలిపివేసిన పెన్షన్ పునరుద్ధరించాలని మంగళగిరికి చెందిన దాసరి మోజెస్ కోరారు. ఎలాంటి ఆదరణ లేని తనకు ఎయిమ్స్ ఆసుపత్రిలో స్వీపర్ ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని నులకపేటకు చెందిన కె.అఖిల విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన విజ్ఞప్తులు ఇవే..

తాడికొండ నియోజకవర్గం గుండాలపాడుకు చెందిన ముస్లిం మైనార్టీలు తమ గ్రామంలో ఉన్న 15 సెంట్ల మసీదు మాన్యంలో షాదీఖానా నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పరిశీలించి చర్యలు తీసుకుంటానని లోకేశ్ హామీ ఇచ్చారు. ఏపీ జెన్‌కోలో ఫైర్, సెక్యూరిటి విభాగాల్లో పని చేస్తున్న మాజీ సైనికులకు రెగ్యులర్ సిబ్బందితోపాటు సమాన వేతనం కల్పించాలని, ఏడాదికి ఉన్న సెలవులను 12 నుంచి 30కు పెంచాలని విజ్ఞప్తి చేశారు. గత 33 ఏళ్లుగా ప్రభుత్వ ఉపాధ్యాయునిగా పని చేస్తున్న తాను ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నానని ఏపీజీఎల్ఐ సొమ్ము ఇప్పించి ఆదుకోవాలని కాకినాడ జిల్లా గొల్లపోలుకు చెందిన సాయిబాబ కోరారు. 1998 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయులకు 62 ఏళ్ల సర్వీసు పొడిగింపుతో పాటు 12 నెలల వేతనం కల్పించాలని, పదవీ విరమణ తరువాత కనీస పింఛన్ కల్పించాలని 1998 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్స్ ఫెడరేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. పల్నాడు జిల్లా, క్రోసూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ బి.రాధాకృష్ణ మంత్రి లోకేశ్‌ను కలిసి శిథిలావస్థలో ఉన్న పాఠశాలకు నూతన భవనం నిర్మించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అందరి విజ్ఞప్తులు విన్న లోకేశ్ త్వరలోనే సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. దీంతో అర్జీదారులు సంతృప్తి వ్యక్తం చేశారు.

సీఎం సహాయ నిధికి విరాళాలు


సీఎం చంద్రబాబుకు చెక్కు అందిస్తున్న పెదకూరపాడు శ్రీ కాకతీయ జూనియర్, డిగ్రీ కాలేజ్ అధ్యాపకులు, విద్యార్థులు


సీఎం చంద్రబాబుకు చెక్కు అందిస్తున్న డాక్టర్ విజయలక్ష్మి, ప్రియాంక, అనిల్ కుమార్


మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు చెక్కు అందిస్తున్న డాక్టర్ కుర్రా మహేష్

తెనాలి, మారీసుపేట సెప్టెంబరు 23: ఇటీవల వరదల్లో నష్టపోయిన బాధితులకు సహాయార్థం ఐఎంఏ తెనాలి శాఖ సభ్యులు, అధ్యక్షురాలు డాక్టర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో రూ. 2.51 లక్షల విరాళం ప్రకటించారు. సోమవారం ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు అందజేశారు. వరద బాధితులను ఆదుకునేందుకు తమవంతుగా సాయం అందించిన ఐఎంఏ తెనాలి శాఖ సభ్యులను సీఎం అభినందించారు. డాక్టర్లు జె.విజయలక్ష్మి, వి.పావని ప్రియాంక, కె.అనిల్‌కుమార్, కె.శ్యాంప్రసాద్, పట్టణ మున్సిపల్ మాజీ చైర్మన్ పెండేల వెంకట్రావ్, తాతా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ. లక్ష విరాళం

రేపల్లె, సెప్టెంబరు 23: ఇటీవల వరదల కారణంగా నష్టపోయిన బాధితులకు చేయూతనివ్వాలనే ఉద్దేశంతో రూ.లక్ష విరాళాన్ని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు అందించినట్లు రామకృష్ణ ఇంగ్లిష్ మీడియం స్కూల్ అధ్యక్షుడు డాక్టర్ కుర్రా మహేష్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కె.అపర్ణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భక్తుల మనోభావాలను గత ప్రభుత్వం పట్టించుకోలేదు


యాగం నిర్వహిస్తున్న మంత్రి మనోహర్

తెనాలి అర్బన్, సెప్టెంబరు 23: గత ప్రభుత్వం తిరుమలలో భక్తుల మనోభావాలు పట్టించుకోకుండా పాలనా వ్యవహారాలు నడిపిందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీపద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం యాగం నిర్వహించారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రాయశ్చిత దీక్షకు సంఘీభావంగా యాగంలో పాల్గొన్నారు. మనోహర్‌కు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. టీడీపీ, బీజేపీ జనసేన నాయకులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ వందల ఏళ్ల నుంచి తిరుమల పవిత్రతను కాపాడుకుంటూ వస్తున్నారని, వైసీపీ ప్రభుత్వం బాధ్యత లేని వారికి పదవులు ఇచ్చి హిందూ ధర్మానికి భిన్నంగా వ్యవహరించిందన్నారు. లడ్డూ ప్రసాదం తయారీలో ఇష్టారీతిన వ్యవహరించిన వారిని ప్రభుత్వం తగిన విధంగా శిక్షిస్తుందన్నారు. ఏ మతమైనా, ఏ దేవుడైనా పాలకులు ఒకే రీతిలో ప్రవర్తించాలని, గత ప్రభుత్వానికి అహంభావం తప్ప మరొకటి లేదని అన్నారు. ఈ యాగం ద్వారా గతంలో జరిగిన పొరపాట్లను ప్రక్షాళన చేసుకుని ముందుకు పోతామన్నారు. దేవుడిపై భక్తి ఉన్న వారికే తమ ప్రభుత్వం బాధ్యతలు అప్పగిస్తుందన్నారు. టీటీడీ చైర్మన్‌గా వ్యవహరించిన వ్యక్తి చేసిన అక్రమాలపై నివేదికలు తయారవుతున్నాయని, చర్యలు తప్పవని హెచ్చరించారు. ట్రస్ట్ బోర్డు చైర్మన్ సాయి, డైరెక్టర్లు, కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

క్వాలిటీ కంట్రోల్ ప్రక్షాళన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

- వైసీపీ భక్త బృందాన్ని బయటకు పంపిన బ్రహ్మయ్య

గుంటూరు సిటీ, సెప్టెంబరు 23: పంచాయతీరాజ్ ఇంజనీర్ల బదిలీల్లో పెనుమార్పులు చోటుచేసుకున్నాయి. ముఖ్యంగా క్వాలిటీ కంట్రోల్ విభాగాన్ని పూర్తిగా ప్రక్షాళన చేశారు. పంచాయతీరాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య గత ప్రభుత్వ తాబేదార్లుగా ఉన్న అధికారులకు పెద్ద ఎత్తున స్థానచలనం కల్పించారు. బదిలీల ప్రక్రియ మొదలైన తర్వాత వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ ప్రజాప్రతినిధులను ఇబ్బంది పెట్టిన పలువురు ఇంజనీరింగ్ అధికారులు చురుగ్గా పావులు కదిపారు. యూనియన్ ను అడ్డం పెట్టుకుని గుంటూరులోని క్వాలిటీ కంట్రోల్ విభాగంలోనే తిష్ట వేసేందుకు ప్రయత్నం చేశారు. వారి ప్రయత్నాలను 'ఆంధ్రజ్యోతి' 'నాడు కక్ష కట్టి.. నేడు కదలరంట' అనే శీర్షికతో వెలువడిన కథనం ద్వారా బట్టబయలు చేసింది. దీంతో అప్రమత్తమైన పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు యూనియన్ లేఖలను క్షుణ్ణంగా పరిశీలించారు. అర్హత లేని వారిని వేరే జిల్లాలకు బదిలీ చేశారు. టీడీపీ ప్రజాప్రతినిధులను ఇబ్బందులు పాలు చేసిన ఇంజనీరింగ్ అధికారులు వేరే జిల్లాలకు వెళ్లిపోయారు. అప్పటి మంత్రి భర్తకు స్నేహితుడిగా చెప్పుకునే అధికారిని, రాజ్యసభ ఎంపీ క్లాస్‌మేట్‌ని, ఇతర వైసీపీ అనుకూల జేఈలను ఇతర జిల్లాలకు పంపారు. పంచాయతీరాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య బదిలీల ప్రక్రియలో పూర్తిగా మార్గదర్శకాలు అమలు చేయటంతో యూనియన్ ముసుగులో ఇక్కడే ఉండాలని చూసిన అధికారుల ఆటలు సాగలేదు. గుంటూరు జోన్ పరిధిలో 183 మంది పంచాయతీరాజ్ ఆయా స్థాయిల్లోని ఇంజనీర్లు బదిలీ అయ్యారు.

దొడ్లేరు సీజీజీబీ ఎదుట రైతుల ధర్నా



క్రోసూరు, సెప్టెంబరు 23: మండలంలోని దొడ్లేరు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్‌లో 14 నెలల క్రితం గోల్డ్ అప్రైజర్ చేతివాటం కారణంగా మాయమైన బంగారాన్ని తమకు ఇప్పించటంలో బ్యాంక్ అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఆరోపిస్తూ సోమవారం బాధిత రైతులు బ్యాంక్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఐదు వందల మంది రైతులకు చెందిన రెండు కిలోలకు పైగా బంగారం మాయమైతే ఇప్పటి వరకు 270 మంది రైతులకు మాత్రమే సమస్య పరిష్కారమైందని రైతులు తెలిపారు. ఈ 14 నెలల్లో అనేకసార్లు బ్యాంక్ అధికారులతో మాట్లాడామని, ఉన్నతాధికారులు, పోలీసు అధికారులు నచ్చ చెప్పిన మీదట ఆగామని రైతుల తరుపున కౌలు రైతు మండల సంఘం అధ్యక్షుడు తిమ్మిశెట్టి హనుమంతరావు తెలిపారు. బ్యాంక్‌కు తాళాలు వేసి బ్యాంక్ ఎదుట బైఠాయించి రైతులు నినాదాలు చేశారు. బ్యాంక్ మేనేజర్ శివ శంకర్, క్రోసూరు ఎస్ఐ నాగేంద్రబాబు రైతులను శాంతింప చేయటానికి ప్రయత్నించారు. బ్యాంక్ మేనేజర్ మాట్లాడుతూ 270 మంది రైతులకు నష్ట పరిహారం చెల్లించామని, మరో 40 మందికి చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ఇంకా 150 మందికి చెందిన బంగారాన్ని రికవరీ చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నామని తెలిపారు. ఎస్ఐ నాగేంద్రబాబు మాట్లాడుతూ బాధ్యుడైన నాగార్జునను రైతుల వద్దకు తీసుకు వస్తామని హామీ ఇచ్చిన మీదట ఆందోళన విరమించారు. రైతు సంఘం మండల కమిటీ నాయకులు దగ్గు నటరాజు, బంగారం రైతుల పోరాట కమిటీ నాయకులు ఈశ్వరరెడ్డి, పాల్గొన్నారు.

షూటింగ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌కు కేఎల్‌యూ విద్యార్థులు


ముఖేష్


ఉమామహేష్

తాడేపల్లి, సెప్టెంబరు 23: ఈ నెల 26 నుంచి అక్టోబరు 6 వరకు పెరు దేశంలోని లిమాలో జరగనున్న షూటింగ్ జూనియర్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారతదేశం తరఫున ప్రాతినిధ్యం వహించేందుకు కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ విద్యార్థులు నేలవల్లి ముఖేష్, మద్దినేని ఉమామహేష్ ఎంపికయ్యారని వర్సిటీ క్రీడల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.హరికిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఇటీవల ఈ పోటీల్లో పాల్గొనే భారత జట్టును ప్రకటించిందన్నారు. గుంటూరు శ్రీనగర్ 4వ లైనుకు చెందిన ముఖేష్ కేఎల్‌యూలో సీఎస్ఐటీ 3వ ఏడాది చదువుతుండగా, ఉమామహేష్ 4వ సంవత్సరం చదువుతున్నాడని తెలిపారు. గత ఆర్నెల్లు జరిగిన ఎంపిక ప్రక్రియలో భాగంగా విశేష ప్రతిభ కనబరిచిన ముఖేష్ మొత్తం ఆరు విభాగాల్లో జాతీయ జట్టుకు ఎంపికై పది పతకాలకు పోటీ పడనున్నట్లు తెలిపారు. మద్దినేని ఉమామహేష్ పది మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో భారతదేశం తరఫున ప్రాతినిధ్యం వహించనున్నాడని చెప్పారు. వీరిద్దరూ ఒలింపిక్ పతక విజేత గగన్ నారంగ్‌కు చెందిన గన్ ఫర్ గ్లోరీ షూటింగ్ అకాడమీలో అంతర్జాతీయ కోచ్‌లతోపాటు సాయ్ శిక్షకుల పర్యవేణలో శిక్షణ పొందుతున్నారని, సోమవారం తెల్లవారుజామున ముంబయి నుంచి పెరు దేశానికి వెళుతున్నట్లు చెప్పారు.

ఏఎన్‌యూ ఇన్చార్జి ఫైనాన్స్ అధికారిగా వెంకటేశ్వర్లు

పెదకాకాని, సెప్టెంబరు 23: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఇన్చార్జి ఫైనాన్స్ అధికారిగా డిప్యూటీ రిజిస్ట్రార్ ఎ.వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఉపకులపతి ఆచార్య కె.గంగాధరరావు ఆదేశాలు జారీ చేశారు. వాటి ప్రకారం ఇన్చార్జి రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం ఉత్తర్వులు ఇచ్చారు. అనంతరం వీసీ గంగాధర రావు వెంకటేశ్వర్లకు నియామక ఉత్తర్వులు అందజేశారు. వికాస కార్యదర్శి కాపూరి శ్రీనివాసరావు, జాయింట్ రిజిస్ట్రార్ సత్యవతి, సూపరింటెండెంట్ భాను ప్రసాద్, ఇంజనీర్ కుమార్ రాజా, సీఈ అలపాటి శివప్రసాదరావు, నేలపాటి నాగేశ్వరరావు, వై. రాధాకృష్ణ పాల్గొన్నారు.

ఏఎన్‌యూ ఏసీఈ నియామకం

పెదకాకాని, సెప్టెంబరు 23: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయానికి సంబంధించి అదనపు పరీక్షల నియంత్రణాధికారి (ఏసీఈ)గా ఎస్.యోబు నియమితులయ్యారు. సోమవారం ఉపకులపతి ఆచార్య కె.గంగాధరరావు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ రిజిస్ట్రార్‌గా వర్సిటీ అభివృద్ధిలో తన వంతు కృషి చేసిన యోబు దాదాపు అన్ని విభాగాల్లో పని చేశారు. రెక్టర్ ఆచార్య రత్న షీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, వికాస కార్యదర్శి కాపూరి శ్రీనివాసరావు, జాయింట్ రిజిస్ట్రార్ సత్యవతి, భానుప్రసాద్, నేలపాటి నాగేశ్వరరావు, జె.శ్రీనివాసరావు, వై.రాధాకృష్ణ తదితరులు యోబుకు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆర్టీసీలో అధికారుల బదిలీలు

గుంటూరు, సెప్టెంబరు 23: ప్రభుత్వ రంగ సంస్థ ఆర్టీసీలో పలువురు అధికారులు బదిలీ అయ్యారు. డిపో మేనేజర్లతోపాటు జిల్లా అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లా డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజనీర్ (సీఎంఈ)గా వ్యవహరిస్తున్న నర్రా శ్రీనివాసరావును విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్టాండ్ డిప్యూటీ చీఫ్ టెక్నికల్ మేనేజర్ (సీటీఎం)గా బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో గుంటూరు బస్టాండ్ కార్గో పార్శిల్ సంస్థ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్(ఏటీఎం)గా వ్యవహరిస్తున్న ఐ.సురేష్‌బాబును ఇన్‌ఛార్జిగా నియమించారు. అలానే మాచర్ల డీఎమ్ పిచ్చయ్యను మంగళగిరి డిపో మేనేజర్‌గా, వినుకొండ డీఎమ్ బి.కోటేశ్వరరావు నాయక్‌ను పిడుగురాళ్ల డిపోకు, నరసరావుపేట డీఎమ్‌గా వ్యవహరిస్తున్న బి.వీరాస్వామిని మాచర్ల డిపోకు, నందికొట్కూరు డీఎంగా పనిచేస్తున్న కె.నాగేశ్వరరావును వినుకొండకు, కనిగిరి డీఎమ్ శ్రీమన్నారాయణను బాపట్ల డిపోకు బదిలీ చేశారు. బాపట్ల జిల్లా ప్రజా రవాణాధికారి (డీపీటీవో) గా గుంటూరు డీపీటీవో రవికాంత్ ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఈ బదిలీల్లోనైనా బాపట్ల డీపీటీవోను నియమిస్తారని అధికారులు భావించినా తాజా జాబితాలో ఆ ఊసే లేకపోవటం చర్చనీయాంశంగా మారింది.

గుంటూరు మీదగా భారత్ గౌరవ్ రైలు

- అక్టోబరు 17 నుంచి 26 వరకు ఉత్తర భారత యాత్ర
- ఆగ్రా, మధుర, వైష్ణోదేవి, హరిద్వార్, రిషికేష్‌ల సందర్శన

గుంటూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తొలిసారిగా భారత్ గౌరవ్ రైలుని గుంటూరు మీదగా నడిపేందుకు ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ) నిర్ణయించింది. ఉత్తర భారత దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల సందర్శన కోసం ఈ రైలుయాత్రని అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు పేర్కొన్నది. అక్టోబరు 17న ప్రారంభమయ్యే ఈ తీర్థయాత్ర 26వ తేదీన ముగుస్తుంది. విజయవాడ నుంచి ప్రారంభమై గుంటూరు, సికింద్రాబాద్‌ల మీదగా ఉత్తర భారత దేశంలో ప్రసిద్ధిగాంచిన పర్యాటక ప్రదేశాలైన ఆగ్రా, మధుర, వైష్ణోదేవి(కాత్రా), హరిద్వార్, రిషికేష్‌ల సందర్శన చేసుకొని తిరిగి గుంటూరుకు చేరుకుంటుంది. ఈ యాత్రకు ఎస్‌సీజెడ్‌బీజీ31 కోడ్‌ని ఐఆర్‌సీటీసీ కేటాయించింది. రాత్రివేళల్లో బస చేసేందుకు తరగతి ప్రయాణాన్ని బట్టి నాన్‌ఏసీ, ఏసీ, రోడ్డు రవాణకు కూడా ఇదే విధానాన్ని అందుబాటులోకి తీసుకున్నట్లు ఐఆర్‌సీటీసీ అధికారులు తెలిపారు. దేశంలో పర్యాటక రంగాన్ని వృద్ధి చేసేందుకు రైల్వే శాఖ ఐఆర్‌సీటీసీకి భారత గౌరవ యాత్ర రైళ్లను కేటాయిస్తుంది. ఇప్పటి వరకు ఏ రైలు అయినా సికింద్రాబాద్ - కాజీపేట - విజయవాడ, చెన్నై - ఒంగోలు - విజయవాడ మీదగానే ప్రయాణిస్తున్నాయి. తొలిసారిగా గుంటూరు మీదగా ఉత్తర భారతదేశానికి యాత్రని ప్రకటించింది. పైన పేర్కొన్న పుణ్యస్థలాల సందర్శన కోసం స్లీపర్‌క్లాస్ అయితే రూ. 17,940, ఏసీ త్రీటైర్ అయితే రూ. 29,380, ఏసీ టూటైర్ అయితే రూ. 38,770గా ఛార్జీలను నిర్ణయించింది. స్లీపర్ క్లాస్ ప్రయాణికులకు నాన్ ఏసీలో గదులు, రవాణ సదుపాయాలు కల్పిస్తారు. యాత్ర పూర్తి వివరాల కోసం ఐఆర్‌సీటీసీ ప్రతినిధులు ప్రవీణ్-92814,95848, బాలాజీ-9281030714లను సంప్రదించాలని అధికారులు సూచించారు.

రాజ్యలక్ష్మికి అవుట్ స్టాండింగ్ లీడర్‌షిప్ లెగసీ అవార్డు



మంగళగిరి, సెప్టెంబరు 23: విజయనగరంలోని గురజాడ జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్ ఆచార్య డి.రాజ్యలక్ష్మికి కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కంపిటెన్సీస్ (సీఎస్‌సీ ఇండియా) నీతి ఆయోగ్ అవుట్ స్టాండింగ్ లీడర్‌షిప్ లెగసీ అవార్డును ప్రకటించింది. జాతీయ ఇంజినీర్ల దినోత్సవం సందర్భంగా జరిగిన వేడుకల్లో వర్చువల్‌గా ఈ అవార్డును ప్రదానం చేశారు. ఇంజినీరింగ్ విద్యా రంగంలో విశేష సేవలందించినందుకుగానూ రాజ్యలక్ష్మి ఈ అవార్డు లభించింది. ఈ సందర్భంగా సీఎస్‌సీ ఇండియా సీనియర్ లెర్నింగ్ కన్సల్టెంట్ వై.రామమోహనరావు మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యా రంగంలో రాజ్యలక్ష్మి అందించిన దీర్ఘకాలిక సేవలను ప్రశంసించారు. ఆమె అంకితభావం, దార్శనికత, నాయకత్వం భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో వర్సిటీ అనేక విభాగాల్లో ప్రగతి సాధించిందన్నారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య జి.జయసుమ, డైరెక్టర్లు, అధ్యాపకులు, సిబ్బంది అవార్డు అందుకున్న రాజ్యలక్ష్మికి అభినందనలు తెలిపారు.

డీసీ మహేశ్వర్ రెడ్డిపై బదిలీ వేటు

- నూతన డీసీగా కేబీ శ్రీనివాసు నియామకం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుంటూరు (కార్పొరేషన్), సెప్టెంబరు 23: వైసీపీలో అంటకాగిన దేవాదాయ శాఖ అధికారులపై ఎట్టకేలకు చర్యలు ప్రారంభమయ్యాయి. ఆ శాఖలో ఉన్న గుంటూరు డిప్యూటీ కమిషనర్ బి.మహేశ్వర్ రెడ్డిని బదిలీ చేస్తూ గొల్లపూడిలోని హెడ్ ఆఫీస్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. ప్రకాశం జిల్లా మాలకొండ నరసింహస్వామి దేవస్థానం ఈవోగా ఉన్న కె.బి.శ్రీనివాసరావును గుంటూరు డీసీగా నియమించారు. ఆంధ్రజ్యోతి గుంటూరు జిల్లా సంచికలో 'వైసీపీతో అంటకాగినా.. అందలమే' శీర్షికన కథనం వెలువడిన విషయం విదితమే. స్పందించిన రాష్ట్ర దేవాదాయ శాఖ అధికారులు తక్షణమే చర్యలు తీసుకుంటూ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. డీసీ ఆఫీస్ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న శ్రీధర్ రెడ్డిని ఒంగోలు బదిలీ చేశారు. గతంలో 2014 నుంచి 2019 వరకు గుంటూరు జిల్లా దేవాదాయ శాఖ ఏసీగా కేబీ శ్రీనివాసరావు పని చేశారు. ఆ కాలంలో రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత కీలకంగా భూ సేకరణలో ఆయన ఎంతో సహకారం అందించారు. అప్పుడు దేవాదాయ శాఖ భూముల పరిరక్షణలో ఆయన విశేషంగా కృషి చేసినట్లు అప్పటి ప్రభుత్వం ఘనంగా ఉత్తమ సేవ పథకం కూడా అందజేసింది.

విశ్వవిద్యాలయాల విద్యార్థుల సమ్మేళనం

పెదకాకాని, సెప్టెంబరు 23: గుంటూరులో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో అక్టోబర్ 27, 28 తేదీలలో జరగబోయే రాష్ట్ర విశ్వవిద్యాలయాల విద్యార్థుల సమ్మేళనం గోడపత్రికలను సోమవారం ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి సూళ్లూరు జయచంద్ర చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ నాయకులు మాట్లాడుతూ రెండు రోజులు పాటు జరిగే ఈ సమ్మేళనంలో ఇండియన్ నాలెడ్జ్ సిస్టంపైన అలాగే నూతన విద్యా విధానం ఇంప్లిమెంటేషన్‌పైన చర్చించేందుకు వేదికగా ఉండబోతుందన్నారు. యూజీసీ, విద్యాశాఖ మంత్రిత్వ అధికారులు పాల్గొంటారని తెలియజేశారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, సెప్టెంబరు 23: పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 42.16 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 33,035 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుందన్నారు. ప్రాజెక్టు వద్ద 36,950 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల చేస్తున్నారు. పవర్ జనరేషన్ ద్వారా 16వేల క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల అవుతున్నాయని తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130, 139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00

45,672 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 49,763 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 45,672 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 22,242 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	8000	16800	334	9000	17000
నెంబరు. 5	10000	14500	నెంబరు. 5	10800	15000
273	9500	14000	273	8500	8500
341	9000	16000	341	10700	17000
4884	13500	13700	4884	10000	13800
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	8000	18800	తేజ	9500	18600
బ్యాడిగి	10000	15000	బ్యాడిగి	10000	15000
దేవనూరు డీలక్స్	9000	16000	దేవనూరు డీలక్స్	11000	16000
తెల్లకాయలు	5000	12000	తెల్లకాయలు	5000	10500

లాభసాటి సాగు దిశగా రైతులను ప్రోత్సహించాలి

● ఎమ్మెల్యే ఆనందబాబు

వేమూరు, సెప్టెంబరు 23 : తక్కువ పెట్టుబడి అధిక ఉత్పత్తి ఎక్కువ నికర ఆదాయం దిశగా వ్యవసాయశాఖ అధికారులు రైతులను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే నక్కా ఆనంద బాబు అన్నారు. సోమవారం గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో పొలం పిలుస్తోంది పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు పొలం పిలుస్తోంది కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ప్రతి మంగళ, బుధవారాల్లో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు, శాస్త్రవేత్తలు ప్రజా ప్రతినిధులతో కలిసి రైతు లను ఒక చోటకు చేర్చి పొలం బాట పంటల సాగుపై చర్చలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో బాపట్ల ఏడీఏ లక్ష్మి, రేపల్లె ఇన్‌చార్జి ఏడీఏ విజయబాబు, కొల్లూరు, భట్టిప్రోలు, అమర్తలూరు, చుండూరు, మండలాల వ్యవసాయ శాఖాధికారులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా బి.బాబూరావు బాధ్యతల స్వీకరణ



బాపట్లరూరల్, సెప్టెంబరు 23: బాపట్ల ఎంపీడీవోగా సోమవారం బి.బాబూరావు బాధ్యతలను చేపట్టారు. ఆయన ఇటీవల చేబ్రోలు మండలం నుంచి బదిలీపై బాపట్ల మండలానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. గ్రామాల్లో పరిసరాల శుభ్రతపై ప్రత్యేక చర్యలు తీసుకుంటానని తెలిపారు.

కర్లపాలెం ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు

కర్లపాలెం,సెప్టెంబరు 23 : కర్లపాలెం నూతన ఎంపీడీవోగా అద్దూరి శ్రీనివాసరావు సోమవారం మండలపరిషత్ కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ప్రకాశం జిల్లాలో పనిచేస్తున్న శ్రీనివాసరావు బదిలీపై బాపట్ల వచ్చారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈగా అనంతరాజు



బాపట్ల, సెప్టెంబరు 23 : బాపట్ల ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈగా మూనూరు అనంతరాజు సోమవారం బాధ్యతలు చేపట్టారు. కాకినాడలో డీఈగా పనిచేస్తూ పదోన్నతిపై బాపట్ల వచ్చిన ఆయన బాధ్యతలు చేపట్టగా సిబ్బంది పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలియజేశారు. గ్రామీణ నీటిసరఫరా విభాగాన్ని సమర్థవంతంగా నిర్వహించి తాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

ధ్యానం కొనుగోలు బకాయిలు 1674కోట్లు విడుదల

కర్లపాలెం, సెప్టెంబరు 23 : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతుల బాధను గుర్తించి ధ్యానం కొనుగోలు బకాయిలకు 1674 కోట్ల నిధులను విడుదల చేశారని ఏట్రవారిపాలెం సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మీ అన్నారు. మండలంలోని ఏట్రవారిపాలెంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ప్రభుత్వం అందిస్తున్న పథకాలు గురించి వివరించారు. ఇంటింటికి తిరిగి ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను గోడలకు అంటించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ ఏలీషాబాబు, కార్యదర్శి పద్మావతి, వీఆర్వో సాంబయ్య, చీరాల శ్రీనివాసరెడ్డి, ఏపీఎం శ్రీనివాసరెడ్డి, నాగిరెడ్డి, కృష్ణారెడ్డి, రాజేంద్ర పాల్గొన్నారు.

స్వచ్ఛత హీ సేవలో వ్యవసాయ ఇంజనీరింగ్ విద్యార్థులు

బాపట్ల, సెప్టెంబరు 23 : స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ ఎన్టీఆర్ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సోమవారం బాపట్ల రైల్వే స్టేషన్ ప్రాంగణంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పరిసరాలు శుభ్రం చేసి మొక్కలు పెరిగే విధంగా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో స్టేషన్ సూపరింటెండెంట్ కెఎమ్ మీనన్, ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ కె.లావణ్య, డాక్టర్ డి.విజయ్‌కుమార్, డాక్టర్ హెచ్ హేమకుమార్, డాక్టర్ ఎస్.అశోక్‌కుమార్, పీడీ వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్తీ నెయ్యితో లడ్డు తయారీ దారుణం : అర్చకులు

బాపట్ల, సెప్టెంబరు 23 : పవిత్రమైన తిరుమల-తిరుపతి దేవస్థానం లడ్డును కల్తీ నెయ్యితో తయారు చేయటం దారుణమని బాపట్ల పట్టణ అర్చకులు, బీజేపీ నాయకులు పేర్కొన్నారు. ఈ విషయమై శ్రీభావన్నారాయణస్వామి దేవాలయ ప్రాంగణంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ వేంకటేశ్వరస్వామి మహాప్రసాదమైన లడ్డు అపవిత్రం చేయడం భక్తుల మనోభావాలను దెబ్బతీయటమే అవుతుందన్నారు. వైసీపీ పాలనలో నిధులు దారిమళ్లించి అనేక అవకతవకలకు పాల్పడ్డారని విమర్శించారు. కార్యక్రమంలో భావపురి పట్టణ పురోహిత సంఘం నాయకులు చివుకుల దుర్గాప్రసాద్, మేడూరు శ్రీరామచంద్రమూర్తి, బీజేపీ నాయకులు బి.బాబునాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కల్తీ నెయ్యి వాడకంపై భక్తుల ఆగ్రహం

వేమూరు, సెప్టెంబరు 23: తిరుమల వేంకటేశ్వర స్వామికి నివేదించే పవిత్రమైన లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వినియోగించి ప్రసాదాన్ని అపవిత్రం చేశారని టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు విఠలదాస భజన మండలి కన్వీనర్ టి.మాధవి ఆవేదన వ్యక్తపరిచారు. మండలంలోని కుచ్చెళ్లపాడులో టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు భక్తులు శ్రీరాముని ఆలయం ముందు నిరసన వ్యక్తపరిచారు. వారిని అరెస్టుచేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

డ్వాక్రా రుణాలు రద్దు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న మహిళలు

కొల్లూరు, సెప్టెంబరు 23 : డ్వాక్రా మహిళలకు ఇచ్చిన రుణాలను రద్దు చేయాలని స్వయం సహాయక సంఘాల మహిళలు కోరారు. సోమవారం కొల్లూరు రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు లంక గ్రామాల్లోని డ్వాక్రా మహిళలు హాజరయ్యారు. సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు డ్వాక్రా మహిళలు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు టీ సురేష్, పీ నాగమల్లేశ్వరరావు, ఎస్ అగ్గిరామయ్య, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

మురుగు డ్రెయిన్ల వద్ద కల్వర్టులు నిర్మించాలి

భట్టిప్రోలు (కొల్లూరు), సెప్టెంబరు 23 : మురుగు కాల్వల వద్ద తూములను తొలగించి కల్వర్టులు నిర్మించాలని వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు ఎం సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం భట్టిప్రోలు అద్దేపల్లి వద్ద ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న పైర్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన రూ.18500లు పరిహారాన్ని మరింత పెంపుదల చేసి రైతులతో పాటు ఉపాధి హామీ కూలీలకు మేట తొలగించే పనులను అప్పగించాలని సూచించారు. రేపల్లె, వేమూరు నియోజకవర్గాల పరిధిలో ఉన్న మురుగు కాల్వలు కొద్దిపాటి వర్షాలకే పొంగిపొర్లుతున్నాయని, ఆయా డ్రెయిన్ల వద్ద ఏర్పాటు చేసిన తూముల వల్ల మురుగు నీరు మొత్తం పొలాలను ముంచెత్తుతుందన్నారు. ముప్పు తొలగించేందుకు డ్రైనేజీ శాఖాధికారులు యుద్ధ ప్రాతిపదికన తూములను తొలగించి కల్వర్టులు నిర్మించాలని కోరారు. దీనికి అవసరమైన భూసేకరణ కూడా ప్రభుత్వమే చేపట్టాలన్నారు. కౌలు రైతులు కూడా ఈక్రాప్ నమోదు చేసి ప్రతి ఒక్కరికి నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

కొల్లూరు, సెప్టెంబరు 23 : మండలపరిధిలోని జువ్వలపాలెంతో పాటు కృష్ణా జిల్లా అముదాల లంక పాఠశాలలోని విద్యార్థులకు సోమవారం ఆంధ్రప్రదేశ్ కంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ (ఏపీసీపీఎస్‌ఈఏ) విద్యా సామాగ్రిని అందజేసింది. 50 మంది విద్యార్థులకు బ్యాగ్‌లు, పుస్తకాలు తదితర సామగ్రిని ఏపీసీపీఎస్‌ఈఏ జిల్లా అధ్యక్షుడు జీ మురళీమోహన్ అందజేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ఆర్థిక కార్యదర్శి ఏ జాకబ్, ఉపాధ్యక్షులు శివరామకృష్ణ, కుటుంబరావు, ఎస్టేట్‌బాబు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

బాపట్లరూరల్, సెప్టెంబరు 23: అక్రమంగా మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని సోమవారం బాపట్లరూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే బాపట్ల మండలం సూర్యలంక గ్రామానికి చెందిన కొక్కిలిగడ్డ నాగేశ్వరరావు మద్యం బాటిళ్లను అక్రమంగా తీసుకెళుతుండగా అతడిని అదుపులోకి తీసుకొని 11 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

జనసైనికుడికి నేతల నివాళి

కర్లపాలెం, సెప్టెంబరు 23 : జనసైనికుడు మరకా రాజు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ మృతి చెందటం బాధాకరమని ఎమ్మెల్యే నరేంద్రవర్మ, బాపట్ల జనసేనపార్టీ సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణలు సంయుక్తంగా అన్నారు. రాజు భౌతికకాయాన్ని సోమవారం వారు సందర్శించి పూలమాల వేసి నివాళి అర్పించారు. కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తాం

● ఇచ్చిన మాట తప్పని ముఖ్యమంత్రి చంద్రబాబు
● యలవర్రు గ్రామసభలో ఎమ్మెల్యే ఆనందబాబు



గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

అమృతలూరు, సెప్టెంబరు 23 : ఇచ్చిన హామీలు అమలు చేసే ఏకైక ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. మండల పరిధిలోని యలవర్రులో 'ఇది మంచి ప్రభుత్వం' గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పని తీరును ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధితో ముందుకు వెళుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు అని, సంక్షోభంలో కూడా పథకాలను అమలు చేస్తున్నాడని కొనియాడారు. ఇచ్చిన మాట ప్రకారం పెన్షన్ రూ.4 వేలు పెంచిన ఘనత చంద్రబాబునాయుడుకే దక్కుతుందన్నారు. మళ్లీ క్షేత్ర స్థాయి నుంచి అభివృద్ధి మొదలు పెట్టాల్సిన పరిస్థితిని మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి కల్పించారని, వ్యవస్థలను నాశనం చేసి, అడ్డగోలు దోపిడీ చేశారని విమర్శించారు. వలంటీర్లు లేకపోతే పెన్షన్‌లు ఇవ్వలేరని తప్పుడు ప్రచారం చేశారని ఇప్పుడు అధికారులు వాటిని పంపిణీ చేస్తున్నారని దీనికి ఏమి సమాధానం చెబుతారని ప్రశ్నించారు. గ్రామాల్లో గంజాయి, చీప్ లిక్కర్ పేదలతో తాగించి వారి ఆరోగ్యం నాశనం చేశారని అన్నారు. యలవర్రులో గతంలో తాను చేసిన అభివృద్ధి తప్ప మరేదైనా అభివృద్ధి జరిగిందా అని గ్రామస్థులను ప్రశ్నించారు. కక్షలు, కార్పణ్యాలకు తమ ప్రభుత్వంలో తావులేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తిరుమల లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి గురించి ప్రస్తావించారు. తొలుత ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు యూ. రాజేష్, మండల ప్రత్యేక అధికారి ప్రసాద్, తహసీల్దార్ కే నెహ్రూబాబు, ఎంపీడీవో షేక్ మహబూబ్ సుబాని, ఏపీఎం రాంబాబు, ఎం రాధాకృష్ణమూర్తి, సర్పంచ్ నాగేశ్వరరావు, పీ వెంకట సుబ్బారావు, కే.మ్యాచ్యూస్, అశోక్, కృష్ణ, ముత్తయ్య పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించడంపై అధికారులు దృష్టి పెట్టాలి

● కలెక్టర్ జె.వెంకటమురళి



కలెక్టర్ జె.వెంకటమురళికి సమస్యలు వివరిస్తున్న బాధితులు

బాపట్ల, సెప్టెంబరు 23 : ప్రజల సమస్యలను పరిష్కరించటంపై అధికారులు దృష్టి పెట్టాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదికకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు వినతిపత్రాల ద్వారా కలెక్టర్‌కు సమస్యలు వివరించారు. సమస్యలు తెలుసుకున్న కలెక్టర్ తన పరిధిలోని వాటికి తక్షణమే పరిష్కారమార్గం చూపక మిగిలినవి ఆయా శాఖాధికారులకు అందజేసి తక్షణ పరిష్కారం చూపాలన్నారు. మొత్తం 146 అర్జీలు వచ్చాయి. ఇప్పటివరకు 191 అర్జీలు పునరావృత మైనట్లు కలెక్టర్ తెలిపారు. పరిష్కారంలో నాణ్యత లోపించటం వల్లే అర్జీలు పునరావృతం అవుతున్నాయన్నారు. కావున అధికారులు స్పందించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్వర్ణాంధ్ర 2047 విజన్ కోసం ప్రతిఒక్కరు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఈ నెల 30వ తేదీన జిల్లా స్థాయి ప్రణాళిక రూపొందిస్తామన్నారు. స్వర్ణాంధ్రలో ప్రతిఒక్కరు భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. సలహాలు స్వీకరించడానికి క్యూఆర్ కోడ్ అందుబాటులోకి తెచ్చామన్నారు. స్కానింగ్ చేసిన వెంటనే 11రకాల ప్రశ్నలు ప్రత్యక్ష మౌతాయన్నారు. కార్యక్రమంలో జేసీ ప్రఖర్‌జైన్, డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, ఆర్డీవో గంధం రవీందర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

● బాపట్ల పట్టణంలోని కారుమూరి హనుమంతరావు నగర్ కాలనీలో సెల్‌టవర్ నిర్మించరాదంటూ కాలనీవాసులు కలెక్టరేట్‌లో వినతిపత్రాన్ని అందజేశారు.

శ్మశానానికి వెళ్లే మార్గంలో ర్యాంప్ ఏర్పాటు చేయాలి

బాపట్లరూరల్, సెప్టెంబరు 23 : వేమూరు నియోజకవర్గం కొల్లూరు మండలంలోని ఆవులవారిపాలెం పంచాయతీ పరిధిలోని మాలలంక ప్రాంతవాసులు శ్మశాన వాటికకు వెళ్లేమార్గంలో ర్యాంప్ సౌకర్యం ఏర్పాటు చేయాలం టూ సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదికలో కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

డ్వాక్రా రుణాల చెల్లింపునకు 5నెలలు గడువు ఇవ్వాలి

కొల్లూరు మండలం సుబ్బర్లంక గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళలు ఇటీవల సంభవించిన వరదల కారణంగా డ్వాక్రా రుణాల చెల్లింపునకు 5నెలలు గడువు ఇవ్వాలంటూ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం

● ఎస్పీ తుషార్ డూడి



అర్జీదారులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ తుషార్ డూడి

బాపట్ల, సెప్టెంబరు 23 : అర్జీలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని పోలీసు అధికారులకు ఎస్పీ తుషార్ డూడి సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 89మంది తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎస్పీకి అర్జీలు అందజేశారు. ఫిర్యాదుల సమస్యలను విని ఇచ్చిన అర్జీలను పరిశీలించి వెంటనే సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదుదారుల సమస్యలను చట్టపరిధిలో విచారించి తక్షణ పరిష్కారం చూపాలని ఆదేశించారు. వివిధ సమస్యలతో పోలీసు కార్యాలయాలకు వచ్చే బాధితులకు భరోసాగా పోలీసుశాఖ ఉండాలన్నారు. వారి సమస్యలను చట్టపరిధిలో విచారించి నిర్దిష్ట గడువులోగా పరిష్కారం చూపాలన్నారు. అర్జీలు పునరావృతం కాకుండా పూర్తి స్థాయిలో విచారించి పరిష్కారం చూపాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిఎస్పీ రామాంజనేయులు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు పంటను దొంగలించారంటూ ఫిర్యాదు

బాపట్లరూరల్, సెప్టెంబరు 23: కారంచేడు మండలం ఆదిపూడి గ్రామానికి చెందిన దాసరి శేఖర్ అనే రైతు తన పొలంలో కొంతమంది పొగాకు పంటను దొంగిలించారంటూ వారిపై చర్యలు తీసుకోవాలంటూ సోమవారం ఎస్పీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ నాపొలంలోని పొగాకు పంటను భవనం నరసింహారెడ్డి, నాదెండ్ల సురేష్‌బాబు, చప్పిడి శ్రీనివాసరావు, కురకల సుబ్బయ్య అనే నలుగురు వ్యక్తులు రాత్రి సమయంలో దొంగిలించారని సదరు వ్యక్తులపై కారంచేడు పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికి పట్టించుకోలేదన్నారు. పోలీసు ఉన్నతాధికారులు నా పంటను దొంగతనం చేసిన ఆ నలుగురిని విచారించి న్యాయం చేయాలని తెలిపారు.

ప్రజాసంక్షేమం కోసం సీఎం చంద్రబాబు నిరంతర కృషి

● టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి జయప్రకాష్ నారాయణ



నందిరాజుతోటలో ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలు పంచిపెడుతున్న తాతా జయప్రకాష్ నారాయణ తదితరులు

బాపట్ల, సెప్టెంబరు 23: ప్రజా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిరంతరం కృషి చేస్తున్నట్లు టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరి తాతా జయప్రకాష్ నారాయణ తెలిపారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని మండలంలోని నందిరాజుతోటలో సోమవారం నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ స్టిక్కర్లు అంటిస్తూ ప్రజలకు కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ముక్కామల సాంబశివరావు, ఈవోపిఆర్డీ పులి శరత్‌బాబు, ఎంఈవో ఎస్ నిరంజన్, గ్రామ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

వందరోజులలో వంద రకాల సేవలు : టీడీపీ, జనసేన

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 100రోజులలో ప్రజలకు వంద రకాల సేవలందించినట్లు కూటమి నాయకులు పేర్కొన్నారు. మండలంలోని కొండుభొట్లపాలెంలో సోమవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని స్పెషలాఫీసర్ ఓంకార్ నేతృత్వంలో నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, నాయకులతో కలిసి టీడీపీ పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజనీ, జనసేన సమన్వయకర్త నామన వెంకటశివన్నారాయణలు ఇంటింటా తిరుగుతూ స్టిక్కర్లు అంటిస్తూ ప్రజలకు కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో తెలుగుయువత అధ్యక్షుడు ఉమ్మారెడ్డి వెంకటేష్, గ్రామ అధ్యక్షుడు కొండలు, బూత్ ఇన్‌చార్జి మార్పు ప్రతాప్, శ్యాంబాబు, గజ్జే వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పిట్టలవానిపాలెం మండలంలో..

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 23: మండలంలోని ఖాజీపాలెం, పిట్టలవానిపా లెం గ్రామ సచివాలయాల నందు మండల ప్రత్యేకాధికారి, డీఎల్‌డీవో కె.సువార్త అన్నారు. ఇది మంచి ప్రభుత్వం గ్రామసభను సోమవారం నిర్వహించారు. ఆయా గ్రామసభల్లో మండల ప్రత్యేకాధికారి కె.సువార్త మాట్లాడుతూ సంక్షోభంలోను సంక్షేమ పథకాలు అందించి అభివృద్ధికి 100రోజుల్లోనే ప్రథమ ప్రాధాన్యతనిచ్చిన ప్రభుత్వమని ఆమె తెలిపారు. తొలుత ఆయా గ్రామాల సచివాలయ పరిధిలోని అధికారులు, ప్రజాప్రతినిధులు సచివాలయ ఉద్యోగులతో కలిసి మొక్కలు నాటారు. గ్రామపంచాయతీలోని ప్రతి ఇంటికి వెళ్లి స్టిక్కర్లను అంటించి కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో భవనం మారుతీశేషమాంబ, సర్పంచులు, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

మంచి ప్రభుత్వాన్ని మంచిగానే చెప్పుకుందాం : ఎంపీటీసీ

కర్లపాలెం, సెప్టెంబరు 23: ప్రజలకు మంచి పనులు చేసి ప్రజా మన్ననలను పొందుతున్న మంచి ప్రభుత్వాన్ని మంచిగా చెప్పుకుందామని వైసీపీ ఎంపీటీసీ, బాపట్ల జిల్లా మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు అన్నారు. మండలంలోని కొత్తనందాయపాలెం పంచాయతీ ఆవరణంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు, కార్యదర్శి లక్ష్మీ, ఉపసర్పంచ్ వెంకటరెడ్డి, మాజీ సర్పంచ్ రాంబాబురెడ్డి, ఈవోపీఆర్డీ ఏలీషాబాబు, ఏపీఎం శ్రీనవాసరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌజన్య, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రతిభా పోటీలు



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ తదితరులు

భట్టిప్రోలు (కొల్లూరు) సెప్టెంబరు 23 : మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాల, ఎయిడెడ్ పాఠశాలల విద్యార్థులకు క్రీడల్లో ప్రతిభ పోటీలు నిర్వహించారు. సోమవారం స్థానిక టీఎం రావు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అండర్-14, అండర్-17 క్రీడా పోటీలకు మండలంలోని ఆయా పాఠశాలల నుంచి 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. క్రీడా పోటీలను ఎంపీపీ లలితకుమారి, జడ్పీటీసీ ఉదయభాస్కరి ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ రాంప్రసాద్, హెచ్‌ఎం రామకోటేశ్వరరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పెరవలిలో మండలస్థాయి ఖోఖో అథ్లెటిక్స్ పోటీలు

వేమూరు, సెప్టెంబరు 23 : మండలంలోని పెరవలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మండలస్థాయి ఖోఖో అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. అండర్-14 బాలికల విభాగానికి విన్నర్స్‌గా చావలి, రన్నర్స్‌గా పెరవలి విద్యార్థులు; అండర్-14 బాలుర విభాగానికి విన్నర్స్‌గా చావలి, రన్నర్స్‌గా పెరవలి విద్యార్థులు; అండర్-17 బాలికల విభాగంలో బాలురు హాజరుకానందున పోటీని నిర్వహించలేదు. విజేతలను పీఈటీలు బుచ్చిరెడ్డి, రవిరాజు, శ్రీనివాస్ అభినందించారు.

రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

● టీడీపీ అధికార ప్రతినిధి విజయబాబు

వేమూరు, సెప్టెంబరు 23: నియోజకవర్గ స్థాయిలో రోగులకు మెరుగైన వైద్యం అందించాలని అందుకు అనుగుణంగా ప్రభుత్వం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ పేరుతో అన్ని సౌకర్యాలను కల్పించారని బాపట్ల పార్లమెంటరీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు పేర్కొన్నారు. సోమవారం ఆయన వైద్యశాలను సందర్శించారు. వైద్యశాలకు కావాల్సిన సౌకర్యాల కల్పనకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

● కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన స్వచ్ఛతా హీ కార్యక్రమంలో భాగంగా వేమూరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నందు ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ వైద్య ఆరోగ్య శాఖ తదితర శాఖలో పని చేస్తున్న ఉద్యోగుల కుటుంబసభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

బలిజేపల్లిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం



కరపత్రాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

వేమూరు, సెప్టెంబరు 23 : ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని బలిజేపల్లిలో ప్రభుత్వ అధికారులు, టీడీపీ శ్రేణులు ఇంటింటికి తిరిగి ప్రభుత్వం 100 రోజుల పాలన గురించి కరపత్రాలు అంజేశారు. మాజీ ఎంపీటీసీ సభ్యులు బెల్లంకొండ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 100 రోజుల పాలన పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొజ్జా వెంకాయమ్మ, ఈవోపీఆర్‌డీ శేఖర్, పంచాయతీ కార్యదర్శి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

భావితరాల భవిష్యత్తు కోసం పలు సంక్షేమ పథకాలు

● రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

చెరుకుపల్లి, సెప్టెంబరు 23: భావితరాల భవిష్యత్తును తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అందిస్తున్నారని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. కనగాల గ్రామంలో ఇది మన మంచి ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రాజెక్టులు పూర్తికావాలంటే చంద్రబాబుకే సాధ్యమన్నారు. వైసీపీ పాలనలో సంవత్సరానికి రూ.250లు పెంచారని, కూటమి ప్రభుత్వంలో పింఛన్‌ను ఒక్కసారే వెయ్యి రూపాయలు పెంచి అందించారన్నారు. గ్రామంలోని సమస్యలను పరిశీలించేందుకు నిత్యం కృషిచేస్తామన్నారు. వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు పూర్తిస్థాయిలో ఆర్థిక సాయాన్ని అందించేందుకు అంచనాలను అధికారులు సిద్ధం చేస్తున్నారన్నారు. త్వరలోనే నష్టపరిహారాన్ని రైతులకు అందించి ఆదుకుంటామన్నారు. అనంతరం టీడీపీ నాయకులు పూషడపు కుమారస్వామిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జేసీ ప్రఖర్‌జైన్, ఆర్డీవో హేలా షారోన్, తహసీల్దార్ సీహెచ్ పద్మావతి, ఎంపీడీవో నాగలక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు మల్లాది రామకృష్ణ, టీడీపీ నాయకులు మొహమాటం రాధాకృష్ణమూర్తి, అవ్వారు శ్రీనివాస్, దివి రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధికి చెక్కు అందజేత



ఎమ్మెల్యే నరేంద్రవర్మకు రూలక్ష చెక్కు అందజేస్తున్న డాక్టర్ మంతెన నరసరాజు

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 23: వరదబాధిత కుటుంబాలవారికి ఆర్థికసా యం అందించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపు మేరకు ముఖ్యమంత్రి సహాయనిధికి అందించేందుకు ఖాజీపాలెంలోని కేవీఆర్ కేవీఆర్ ఎంకేఆర్ డిగ్రీ కళాశాల పాలకవర్గం అధ్యక్షుడు డాక్టర్ మంతెన నరసరాజు లక్ష రూపాయల చెక్కును ఎమ్మెల్యే నరేంద్రవర్మకు అందజేశారు.

డ్వాక్రా గ్రూప్ రూ.25వేలు

బాపట్ల, సెప్టెంబరు 23: పట్టణంలోని మున్నంవారిపాలెం డ్వాక్రా గ్రూప్ సభ్యులు వరద బాధితులను ఆదుకునేందుకు తమ వంతుగా రూ.25వేల చెక్కును సీఎం రిలీఫ్‌ఫండ్‌కు పంపించాలని కోరుతూ ఎమ్మెల్యే నరేంద్రవర్మకు సోమవారం చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా నరేంద్రవర్మ వారిని అభినందించారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్ విజయమ్మకు వినతిపత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు

బాపట్ల, సెప్టెంబరు 23: జిల్లాలోని ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించే విధంగా చూడాలని కోరుతూ సోమవారం డీఎంహెచ్‌వో డాక్టర్ విజయమ్మకు వినతిపత్రం అందజేశారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలో వైద్యసిబ్బంది, ఆశా వర్కర్లతో నిర్వహించిన సమావేశంలో ఆమెకు అర్జీ అందజేసి సమస్యలను వివరించారు. నెలకొకసారి ఆశావర్కర్లతో చర్చించి పరిష్కరిస్తామని ఆమె హామీనిచ్చారు. కార్యక్రమంలో వి.రూపస్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

● సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ మజుందార్

బాపట్ల, సెప్టెంబరు 23 : కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ మజుందార్ డిమాండ్ చేశారు. ఈ విషయమై బాపట్ల రైల్వేస్టేషన్ కూడలిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి మజుందార్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ కార్మిక సంఘాలతో చర్చించకుండా నేరుగా 44 కార్మిక చట్టాలను, 4 కోడ్స్‌గా మార్చటం దుర్మార్గమన్నారు. దీనివల్ల కార్మికుల హక్కులు హరించబడుతాయన్నారు. దేశవ్యాప్తంగా స్కీమ్ వర్కర్లుగా పనిచేస్తున్న అంగన్‌వాడీ, ఆశా, మిడ్‌డే మీల్స్, మెడికల్ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులను రెగ్యులర్ చేయాలని కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.శరత్, ఆశా వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ధనలక్ష్మి, వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కార వేదికకు ఏడు ఫిర్యాదులు

రేపల్లె, సెప్టెంబరు 23: ప్రజాసమస్యల పరిష్కార వేది కకు ఏడు ఫిర్యాదులు అందాయని ఆర్డీవో హేలా షారోన్ అన్నారు. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. రేపల్లె మున్సిపాల్టీ లో ఆంజనేయస్వామి గుడిదగ్గ ర నుంచి రాజ్యలక్ష్మి థియేటర్ వరకు రోడ్డుకు ఇరువైపులా తో పుడు బండ్లు పెట్టడంతో ట్రాఫి క్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడటంతో పాటు పళ్ల నుంచి వచ్చే వ్యర్థాలను డ్రైయినేజీలో పడివెయ్యటంతో మురుగునీరు పారుదల కావటం లేదని, పార్కుగోడను ఆక్రమించటం వల్ల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే సమస్యను పరిష్కరించాలని అర్జీ అందినట్లు ఆమె తెలిపారు.

● నగరం మండలం పెద్దపల్లి గ్రామంనందు డ్వాక్రాగ్రూపులో జరిగిన అవకతవకలపై విచారణ జరిపి సమస్యను పరిష్కరించాలని అర్జీ అందినట్లు చెప్పారు. పెదమట్లపూడి గ్రామంకు చెందిన తాడేపల్లి మంగమ్మ, మరో ఐదుగురు రైతులు కలిసి వారి పంట భూముల పక్కన కుంటను త్రవ్వటం వల్ల పంటసాగు చేసుకోలేకపోతున్నామని సదరు సమస్యను పరిష్కరించాలని, సిరిపూడి గ్రామానికి చెందిన అప్పికట్ల చంద్రవతి మరికొంతమంది రైతులు పంటభూముల పక్కన కుంటలను తవ్వటం వల్ల పంటసాగుకు ఇబ్బంది పడుతున్నామని తక్షణమే విచారించి సమస్యను పరిష్కరించాలని కోరుతూ అర్జీలు అందినట్లు ఆర్డీవో తెలిపారు.

27వ తేదీన జాబ్‌మేళా

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 23: మండలంలోని కేవీఆర్ కేవీఆర్ ఎంకేఆర్ డిగ్రీ కళాశాల నందు ఈ నెల 27వ తేదీన జాబ్ మేళా జరుగుతుందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి కార్యాలయం సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఖాజీపాలెం కళాశాల నందు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజీరావు, కళాశాల ప్రిన్సిపాల్ టి.శివప్రసాదరావులు సోమవారం సంయుక్తంగా ఓ ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాకు 10వతరగతి, ఇంటర్, డిగ్రీ, డిప్లమా, పీజీలు చదువుకున్న యువతీ, యువకులు 18నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగి ఉండాలన్నారు. వివరాలకు 9640695229లో సంప్రదించాలన్నారు.

రక్తదానం చేసిన 30 మంది ఎన్‌సీసీ విద్యార్థులు

రేపల్లె, సెప్టెంబరు 23: ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు ఎన్‌సీసీ విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేయడం అభినందనీయమని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవిచంద్రకుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఏబీఆర్ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ, రెడ్‌రిబ్బన్‌క్లబ్ సంయుక్తంగా రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రెడ్‌రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ బుచ్చిబాబు, రెడ్‌క్రాస్ డిస్ట్రిక్ చైర్మన్ వి.వీరరాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

రేపల్లె, సెప్టెంబరు 23: విద్యార్థులు విద్యలో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు పిన్ని సాంబశివరావు అన్నారు. సోమవారం వరద ప్రభావిత ప్రాంతమైన పెనుమూడి గ్రామంలో ఉషోదయ హైస్కూల్ విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కిషోర్, మోహన్‌రావు, నరసింహరావు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



రూ.3 కోట్లతో నిర్మించిన సబ్‌స్టేషన్ శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి గొట్టిపాటి రవికుమార్

టీడీపీ కూటమి తరపున ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన అనేక హామీలను ప్రభుత్వం వంద రోజులలో నేరవేర్చింది. పెన్షన్ల పెంపు, ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు, అన్న క్యాంటీన్లు పునరుద్ధరణతోపాటు పలు పథకాలపై దృష్టి పెట్టింది. రాష్ట్రంలో సంస్కరణలతోపాటు వైసీపీ ప్రభుత్వం వివిధ శాఖల్లో నిలిపేసిన ప్రజోపయోగ పథకాలను తిరిగి చేపట్టింది. ఇలా ప్రజలకు మేలు జరిగే అనేక మంచి పనులు చేపట్టిన కూటమి ప్రభుత్వం ఆ విజయాలను 'ఇది మంచి ప్రభుత్వం' పేరుతో ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లాలని నిర్ణయించింది. వంద రోజుల పాలన పూర్తయిన ఈనెల 20 నుంచి 26 వరకు వారంరోజుల పాటు ప్రత్యేక కార్యక్రమం చేపట్టి సభలు, సమావేశాల నిర్వహణతోపాటు ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిసి వివరించాలని తెలిపింది. అందులో ప్రజాప్రతినిధులు, స్థానిక అధికారులు, సిబ్బంది పాల్గొనాలని ఆదేశించింది. తదనుగుణంగా జిల్లాలో కార్యక్రమం ఉత్సాహంగా సాగుతోంది.

ప్రజల వద్దకే పాలన

ఇంటింటికీ వెళ్తున్న పాలకవర్గం

ఇది మంచి ప్రభుత్వం పేరుతో..

వంద రోజుల విజయాలపై ప్రచారం

పలు ప్రాంతాల్లో ప్రజాప్రతినిధులు, ముఖ్యనేతల భాగస్వామ్యం

ఒంగోలు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు 'ఇది మంచి ప్రభుత్వం' పేరుతో ప్రజల వద్దకు వెళ్తున్నారు. స్థానిక సిబ్బందితో కలిసి రాష్ట్ర ప్రభుత్వం వంద రోజుల్లో సాధించిన విజయాలను ప్రజలకు వివరిస్తున్నారు. ఈ ఏడాది జూన్ 12న రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడగా ఈ నెల 20 నాటికి వంద రోజుల పాలన పూర్తయింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఈ వంద రోజులలో చేపట్టిన పథకాలు, వివిధ అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజల వద్దకు వెళ్లి వివరించాలని పాలక పెద్దలు నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి ఊహించని విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు జిల్లా నుంచే ప్రారంభించిన విషయం విదితమే. తొలి రోజున నాగులుప్పలపాడు మండలం మద్దిరాలపాడులో ఆ కార్యక్రమం జరగ్గా కొద్దిగంటల వ్యవధి ముందుగా మాత్రమే సమాచారం అందినా జిల్లా యంత్రాంగం స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో విజయవంతం చేశారు.



ముక్తినూతలపాడులో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

కాగా అదే ఉత్సాహంతో జిల్లావ్యాప్తంగా ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమం కొనసాగుతోంది. అందులోభాగంగా సోమవారం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కీలక ప్రజాప్రతినిధులు, ఇతర ముఖ్యనేతలు ఆధ్వర్యంలో కార్యక్రమాలు కొనసాగగా టీడీపీ శ్రేణులు, స్థానిక సిబ్బంది ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వ విజయాలు వివరిస్తూ కరపత్రాలు పంపిణీతో పాటు స్టిక్కర్లను అందించారు.

అన్ని నియోజకవర్గాల్లో ఉత్సాహంగా...

కనిగిరి నియోజకవర్గంలోని వెలిగండ్లలో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి నేతృత్వంలో గ్రామసభ జరగ్గా విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఒంగోలు నగర పరిధిలోని ముక్తినూతల పాడులో సోమవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పాల్గొనగా నగరంలోని పలు డివిజన్లలో స్థానిక టీడీపీ శ్రేణులు నిర్వహించారు. దర్శి నియోజక వర్గంలోని వెంకటాపురం, ఇతర గ్రామాల్లో టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి నేతృత్వంలో జరిగిన సభల్లో ఎమ్మెల్సీ అశోక్‌బాబు, మాజీ ఎమ్మెల్యే పాపారావు, పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నూకసాని బాలాజీ పాల్గొన్నారు. గిద్దలూరులో జరిగిన కార్యక్రమంలో అక్కడి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొనగా త్రిపురాంతకం మండలం గొల్లవాండ్లపల్లిలో టిడిపి ఇన్‌చార్జ్ ఎరిక్షన్‌బాబు పాల్గొన్నారు. సంతనూతలపాడు నియోజకవర్గం చీమకుర్తిలో టీడీపీ పార్లమెంట్ ఉపాధ్యక్షుడు మన్నం ప్రసాద్ నేతృత్వంలో పెద్దసంఖ్యలో టీడీపీ శ్రేణులు ఈ కార్యక్రమం నిర్వహించారు.

వైసీపీ హయాంలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం

● మంత్రి గొట్టిపాటి రవికుమార్

కనిగిరి, సెప్టెంబరు 23: గత వైసీపీ పాలనలో ప్రభుత్వ వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయని విద్యుత్ శాఖమంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. రాష్ట్ర ఆర్థికంగా వెనుకబడిపోయిందన్నారు. సోమవారం పట్టణ సమీపంలోని అర్బన్ కాలనీలో నూతనంగా రూ.3కోట్లతో ఏర్పాటు చేసిన 11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో మంత్రి రవికుమార్ మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తిచేసి కనిగిరి ప్రాంతంలో వ్యవసాయ రంగానికి ఊతమిస్తామన్నారు. కనిగిరి ప్రాంతంలో మరమ్మతులకు గురైన స్తంభాలను తొలగించి వాటి స్థానంలో వంద నూతన స్తంభాలు ఏర్పాటు చేయిస్తామన్నారు. ఇటీవల కనిగిరి పట్టణంలోని ముగ్గురు యువకులు విద్యుదాఘాతంతో మరణించడం దురదృష్టకరమన్నారు. వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం అందించినట్టు చెప్పారు. కనిగిరి ప్రాంతంలో ఆర్‌డీఎస్ స్కీం కింద రూ.70 కోట్లతో విద్యుత్ పనులు చేపట్టి పూర్తి చేయనున్నట్టు చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో కూడా కనిగిరిలో అన్న కాంటీన్ నిర్వహించి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర పేదల ఆకలి తీర్చటం గొప్ప విషయమన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను సీఎం చంద్రబాబు చేపట్టారన్నారు. కనిగిరి ప్రాంతంలో అదనంగా సబ్‌స్టేషన్లు మంజూరు చేయించాలని మంత్రికి విజ్ఞప్తి చేశారు. అనంతరం సబ్‌స్టేషన్‌లలో నూతనంగా ఎంపికైన ఆరుగురు షిఫ్ట్ ఆపరేటర్లకు నియామకపత్రాలు అందజేసి ప్రాంగణంలో మొక్కలు నాటారు. తొలుత మండలపరిధిలోని నందనమారెళ్లలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు.



కారు దిగొచ్చిన కలెక్టరమ్మ..!

పేద కుటుంబంపై మానవత్వం చాటుకున్న వైనం

కలెక్టరేట్ వద్ద బాల భిక్షాటకులకు ఆసరా..!

కొత్త దుస్తులు కొనిచ్చి.. వైద్యసేవలు అందించి.. నైట్ షెల్టర్‌లో వసతి

విధి నిర్వహణలో నిరంతరం బిజీగా గడిపే కలెక్టర్ తమీమ్ అన్సారియా మానవత్వం చాటుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగే స్పందన కార్యక్రమానికి హాజరవుతున్న క్రమంలో ఆవరణలో కనిపించిన దృశ్యం ఆమెను కదలించింది. కారులో వెళుతున్న కలెక్టర్‌కు అక్కడే గాంధీ వేషధారణలో ఉన్న ఇద్దరు ఆడపిల్లలను చూసి ఆగారు. గుంతకల్లుకు చెందిన ఓ సంచార జాతులకు చెందిన కుటుంబం ఐదుగురు పిల్లల్తో అక్కడే భిక్షాటన చేస్తుండగా వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా ఇద్దరు చిన్నారులు ఒంటి నిండా సిల్వర్ రంగు పూసుకుని, మహాత్మాగాంధీ వేషధారణలో భిక్షాటన చేస్తుండటం గుర్తించారు. వారిలో ఎనిమిది నెలల చిన్నారి కూడా ఉంది. దీంతో కార్పొరేషన్ కమిషనరు కే. వెంకటేశ్వరరావును, మెప్మా పీడీ టి.రవికుమార్‌ను అక్కడకు పిలిపించారు. వెంటనే చిన్నారులను జీజీహెచ్‌కు తరలించి, వారికి అవసరమైన వైద్యం అందించాలని ఆదేశించారు. దీంతో కమిషనరు వారిని జీజీహెచ్‌కు తీసుకెళ్లడంతోపాటు వారికి స్నానం చేయించి, అవసరమైన కొత్త దుస్తులు అందజేశారు. అనంతరం వారి కుటుంబసభ్యులకు వైద్య పరీక్షలు నిర్వహించి, జీజీహెచ్‌లోని నైట్ షెల్టర్‌లో వారికి వసతి కల్పించారు. అంతేకాకుండా చదువుకోవాల్సిన వయస్సులో భిక్షాటన చేయకూడదని కలెక్టర్ ఆ కుటుంబానికి పిల్లలను హాస్టల్‌లో చేర్పించి, చదివిస్తానని, అలాగే అవసరమైతే నివాస స్థలం కూడా ఏర్పాటు చేస్తామని వారికి భరోసా ఇచ్చారు. కాగా కలెక్టర్ స్పందించిన తీరు పట్ల అక్కడ ఉన్న జేసీ గోపాలకృష్ణ, ఇతర ప్రభుత్వ అధికారులు, పలువురు కలెక్టర్ పెద్ద మనస్సును అభినందించారు.

- ఒంగోలు (కార్పొరేషన్)

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

వెంకటాచలం, సెప్టెంబరు 23 : మండలంలోని టోల్‌ప్లాజా వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. మరో ఇద్దరు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. గుడ్లూరుకి చెందిన వ్యాపారి సైదులు చెన్నైలో కోడిగుడ్లు కొనుగోలు చేసుకుని బోలేరో వాహనంలో తిరిగి వస్తుండగా వారువస్తున్న వాహనం ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో గుడ్లూరుకి చెందిన బోలేరో డ్రైవర్ అశోక్ (33) వాహనంలోనే ఇరుక్కొని అక్కడికక్కడే మృతి చెందాడు. వ్యాపారి సైదులుతోపాటు ఆయన అన్న కుమార్తె గాయపడ్డారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని క్షతగాత్రులను నెల్లూరుకి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌కి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వాహనంలో ఇరుక్కొని మృతిచెందిన అశోక్

రేణంగివరంలో మట్టి తోలకంపై కేసు

ఎక్స్‌కవేటర్‌తో సహా ఏడు ట్రాక్టర్లు స్వాధీనం

అవమాన భారంతో స్థానిక నేత ఆత్మహత్యాయత్నం

పంగులూరు, సెప్టెంబరు 23 : మండలంలోని రేణంగివరంలోని ఊర చెరువులో ట్రాక్టర్లతో మట్టి తరలింపును పోలీసులు అడ్డుకున్నారు. ఎస్ఐ వినోద్‌బాబు ఇచ్చిన సమాచారం మేరకు.. రెవెన్యూ అధికారులు అందించిన సమాచారంతో చెరువులో మట్టిని అక్రమంగా తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లతో పాటు మట్టిని లోడ్ చేస్తున్న ఎక్స్‌కవేటర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై ఆర్ఐ ఏసురత్నం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఇంటి అవసరాల కోసం మట్టి తోలుకోవడాన్ని పోలీసులు అడ్డుకున్నారని, దీనిని అవమానంగా భావించిన స్థానిక నేత పోలీసు స్టేషన్ ఎదుట పురుగు మందు తాగే ప్రయత్నం చేశారు. గమనించిన పోలీసులు అడ్డుకుని అతడిని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం అక్కడ నుంచి ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేత



వరద బాధితులకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

వరద బాధితులకు వస్త్రాల పంపిణీ

చీరాలటౌన్, సెప్టెంబరు 23 : వరద ప్రమాదంతో నిస్సహాయ స్థితిలో ఉన్నవారికి ప్రతి ఒక్కరూ సాయం అందించాలని చీరాల మహాత్మాగాంధీ క్లాత్ మార్కెట్ డెవలప్‌మెంట్ సొసైటీ, టెక్స్‌టైల్స్ మర్చంట్ సొసైటీ ప్రతినిధులు కోరారు. భట్టిప్రోలు సమీపంలోని పెద్దలంక, పెసర్లంక గ్రామాల్లోని ప్రజలకు సుమారు రూ.4లక్షల విలువైన నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ అనుకోని రీతిలో సంభవించిన విపత్తు కారణంగా ఎందరో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారన్నారు. ఈక్రమంలోనే తమవంతు సాయం అందించామన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు గుర్రం రాఘవరావు, కోట శ్రీమన్నారాయణ, బ్రహ్మానందం, శ్యామ్ ప్రసాద్, నారాయణరావు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ సంచులు వాడొద్దు



జూట్ బ్యాగులను పంపిణీ చేస్తున్న ట్రాఫిక్ ఎస్సై

చీరాల, సెప్టెంబరు 23 : ప్లాస్టిక్ సంచుల వాడకం వద్దు.. జూట్ సంచులు ముద్దని పొల్యూషన్ కంట్రోలు బోర్డ్ ఏఈ రామకోటయ్య అన్నారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం చీరాల మార్కెట్ సెంటర్ తదితర ప్రాంతాల్లో ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలను వివరించారు. చీరాల కూరగాయల మార్కెట్, బాపట్ల కూరగాయల మార్కెట్, రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో 500 జూట్ బ్యాగులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై, ఐటీసీ ప్రతినిధి ఎంఎస్ రెడ్డి, ప్రొటెక్ట్ ఎన్‌జీఓ ప్రతినిధి చంద్రారెడ్డి, కొండలు పాల్గొన్నారు.

వర్క్‌షాప్‌ను వినియోగించుకోవాలి

చీరాల, సెప్టెంబరు 23 : సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన వర్క్‌షాప్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు చెప్పారు. సోమవారం కళాశాలలో ఈసీఈ విభాగానికి చెందిన 2, 3 సంవత్సరాల విద్యార్థులకు ఎపైస్వేకేర్ ప్రైవేటు లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో మూడు రోజుల వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఇంటర్‌నెట్ ఆఫ్ థింక్స్, ఎంబెడెడ్ సిస్టమ్స్‌పై అవగాహన కల్పించి, ప్రయోగాలు చేస్తుందని ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ డి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆపన్నహస్తం అభినందనీయం

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, సెప్టెంబరు 23 : తోటివారికి సాయపడాలనే మంచి మనస్సులో వరద బాధితుల సహాయార్థం, అన్న క్యాంటీన్ నిర్వహణకు ఇతోధికంగా ఆర్థిక సాయం అందిస్తున్న శ్రీగౌతమి విద్యా సంస్థల యాజమాన్య ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు అభినందనీయులని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. శ్రీగౌతమి విద్యా సంస్థలలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రతినిధులు వరద బాధితుల సహాయార్థం రూ.1.50లక్షలు, అన్న క్యాంటీన్ నిర్వహణకు రూ.10వేలు చెక్కుల రూపంలో ఎమ్మెల్యే కొండయ్యకు అందజేశారు. కార్యక్రమంలో విద్యా సంస్థల ప్రతినిధులు ఎం.వెంకటేశ్వర్లు (ఎంవీ, కె.వెంకట్రావు (కేవీ), ఉపాధ్యాయులు, విద్యార్థులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఒకే ఒక్కడు

బాలినేనితో జనసేనలోకి వాయల

వైసీపీలోనే ఉంటామంటున్న సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల నాయకులు

కొత్తపట్నం(ఒంగోలు నగరం) సెప్టెంబరు 23: ఆయనతో పోయేదెవరు.. ఇక్కడే (వైసీపీలో) ఉండేదెవరు అనే అభిప్రాయ సేకరణలో ఒకే ఒక్కడు నేను వెళతానంటూ ముందుకొచ్చాడు. మిగిలిన నాయకులు, వైసీపీ తరపున సర్పంచ్‌లు, ఎంపీటీసీలుగా గెలిచిన వారు, కార్యకర్తలు, గ్రామస్థాయి నాయకులు కూడా బాలినేనితే పోయేదే లేదంటూ తేల్చిచెప్పారు. వైసీపీ మండల స్థాయి విస్తృత సమావేశం సోమవారం రాత్రి కొత్తపట్నంలో కళ్యాణ మండపంలో జరిగింది. జనసేన తీర్థం పుచ్చుకోబోతున్న మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డితో కలిసి నడిచేది ఎంతమంది అనే విషయంపై ప్రత్యేకించి ఈ సమావేశాన్ని నిర్వహించారు. బాలినేని దూతగా ఇనగంటి పిచ్చిరెడ్డి అక్కడికి హాజరయ్యారు. అయితే ఈ సమావేశంలో దాదాపు అందరూ బాలినేని వెంట జనసేనలోకి వెళ్లేదే లేదంటూ కరాఖండిగా తేల్చిచెప్పారు. మాజీ ఎంపీపీ వాయల మోహనరావు మాత్రమే బాలినేని వెంటే నేను.. ఆయనతోనే నా పయనం అంటూ తన అభిప్రాయాన్ని తేల్చిచెప్పారు. సమావేశంలో ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి, దాచూరి గోపాలరెడ్డి, వీరేపల్లి రామచంద్రారెడ్డి(వీఆర్సీ), జిల్లా వ్యవసాయ సలహామండలి మాజీ చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి, వాయల మోహనరావు, మండలంలోని వైసీపీ సర్పంచిలు, ఎంపీటీసీలు, గ్రామస్థాయి నాయకులు కూడా పాల్గొన్నారు. బాలినేని వైఖరిపై సమావేశంలో కొంతమంది ఆగ్రహం వ్యక్తం చేయగా మరికొందరు అసంతృప్తి వ్యక్తం చేశారు. పార్టీని నట్టేట ముంచేసి జనసేనలోకి పోతున్న బాలినేనితో కలిసి నడిచే ప్రసక్తేలేదంటూ సమావేశంలో పాల్గొన్న అందరూ తేల్చిచెప్పారు. ఒక్క వాయల మోహనరావే నాకు అన్నివేళలా అండదండగా ఉన్న బాలినేనితోనే తాను అడుగులు వేస్తానంటూ అభిప్రాయాన్ని తేల్చిచెప్పారు. కాగా వాయలపై సమావేశంలో పలువురు వైసీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేయటం గమనార్హం. మొత్తం మీద బాలినేని ఆశించినట్లుగా కొత్తపట్నం మండలం నుంచి జనసేన జెండా కిందకు పోయే వారు ఒక్కరే కనిపిస్తున్నారు. మిగిలిన వైసీపీ నాయకులు, కేడర్ ఆయన తీరుపై ఆగ్రహంతో ఊగిపోతున్నారు.



కొత్తపట్నంలో జరిగిన వైసీపీ సమావేశంలో మాట్లాడుతున్న అంజిరెడ్డి, హాజరైన నేతలు

ష్.. గప్‌చుప్!

బాలినేని, జనార్దన్‌లకు అధిష్ఠానాల ఆదేశాలు

ఆంధ్రజ్యోతి, ఒంగోలు : ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిలు స్థానికంగా మాటల తూటాలు పేల్చుకోవద్దని అధిష్ఠానాల నుంచి ఆదేశాలు అందినట్లు తెలిసింది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంలోని భాగస్వామ్య పార్టీలు అనేక అంశాలపై ఉమ్మడిగా కలిసి పయనిస్తున్న విషయం విదితమే. అయితే జిల్లాలో ఇటు దామచర్ల, అటు జనసేనలో చేరబోతున్న బాలినేనిలు ఆదివారం ఒకరిపై ఒకరు చేసుకున్న విమర్శలపై రెండు పార్టీల అధిష్ఠానాలు స్పందించినట్లు తెలుస్తోంది. రాష్ట్రస్థాయిలో ప్రతి విషయంలోనూ టీడీపీ వైపు నుంచి సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్‌లు, జనసేన నుంచి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమన్వయంతో ముందుకెళ్తున్నారు. ఎక్కడైనా సమస్యలు వస్తే ఒకరికొకరు మాట్లాడుకొని తదనుగుణంగా ముందుకు సాగుతున్న విషయం జగమెరిగిన సత్యం.ఈ నేపథ్యంలో దామచర్ల, బాలినేనిలు బహిరంగా ఒకర్పై ఒకరు వ్యాఖ్యానాలు చేసుకోవడంతో అధినాయకులు ఈవిషయంపై దృష్టి సారించినట్లు సమాచారం. తదనుగుణంగా ముున్ముందు మీరు సమస్యలు వచ్చినా తమ దృష్టికి తేవాలని, కిందిస్థాయిలో ఒకరిపై ఒకరు వ్యాఖ్యానాలు చేసుకుంటూ బజారుకెక్కడం సరికాదన్న సంకేతాన్ని వారికి ఇచ్చినట్లు తెలుస్తోంది. తద్వారా ఇద్దరూ స్థానికంగా బహిరంగంగా వ్యాఖ్యానాలు ఫుల్‌స్టాప్ పెట్టే దిశగా రాష్ట్ర నాయకుల నుంచి ఆదేశాలు అందినట్లు సమాచారం. కాగా, జనసేనలో చేరబోతున్న బాలినేనికి కూడా వివిధ కారణాల దృష్ట్యా పార్టీలో చేరే కార్యక్రమానికి పరిమితంగానే నాయకులను తీసుకురావాలన్న సంకేతాలు అందినట్లు తెలిసింది.


ఒంగోలు కార్పొరేషన్‌లో వైసీపీలో ఉన్న కార్పొరేటర్‌లతోపాటు, కొందరు ద్వితీయ శ్రేణి నాయకులు, వైసీపీ ప్రజాప్రతినిధులను తనతోపాటు పార్టీలో చేరేందుకు బాలినేని సిద్ధం కాగా, వెంకటేశ్వర స్వామి దీక్షలో పవన్ కల్యాణ్ ఉన్నందున పరిమిత సంఖ్యలోనే పార్టీలో చేరే వారిని తీసుకురావాలని ఆదేశాలు కూడా బాలినేనికి ఇచ్చినట్లు తెలిసింది. కావాలంటే పవన్ కల్యాణ్ దీక్ష పూర్తయిన తర్వాత మరోసారి ఒంగోలులో కార్యక్రమం ఏర్పాటు చేసుకొని మిగిలిన వారు పార్టీలో చేరే కార్యక్రమాన్ని నిర్వహిద్దామని, 26వతేదీ మాత్రం బాలినేనితోపాటు పరిమిత సంఖ్యలోనే పార్టీలో చేరే వారిని తీసుకురావాలని స్పష్టం చేసినట్లు తెలిసింది. కిందిస్థాయిలో ఒకట్రెండు జిల్లాలో రెండు పార్టీల నాయకుల మధ్య వచ్చిన విభేదాలతో రాష్ట్రస్థాయిలో సఖ్యత దెబ్బతినకూడదన్న ఉద్దేశంతో ఇరు పార్టీల అధిష్ఠానాలు ఇటు దామచర్ల, అటు బాలినేనికి బజారుకెక్కవద్దని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు సమాచారం. తదనుగుణంగానే సోమవారం ఈ ఇద్దరు నాయకులు ఆదివారం చోటుచేసుకున్న ఘటనలకు కొనసాగింపుగా వ్యాఖ్యానాలు చేయకుండా మిన్నకుండిపోయినట్లు తెలుస్తోంది.

ఐదు చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

రూ.3.41లక్షల సొత్తు స్వాధీనం

అద్దంకి, సెప్టెంబరు 23 : అద్దంకి, బల్లికురవ, పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఐదు దొంగతనాల కేసులకు సంబంధించి నిందితుడిని అరెస్టు చేసి రూ.3,041,500 విలువైన సొత్తుని స్వాధీనం చేసుకున్నట్లు అద్దంకి టౌన్ సీఐ కృష్ణయ్య తెలిపారు. వివరాలలోకి వెళితే.. ఒంగోలు కార్పొరేషన్ పరిధిలోని సంతనూతలపాడు మండలం పేర్నమిట్టకు చెందిన తన్నీరు మధుబాబు అద్దంకి, బల్లికురవ, పోలీస్ స్టేషన్‌ల పరిధిలో దేవాలయాలతో పాటు తాళాలు వేసి ఉన్న ఇళ్లల్లో చోరీలకు పాల్పడ్డాడు. అద్దంకి, కలవకూరు రోడ్లలో ఇటుక బట్టీల వద్ద ట్రాక్టర్ ట్రాలీ, ఆటోలతో పాటు దేవాలయాల్లో ఉపయోగించే వెండి పాదుకలు, పట్టాలు, కుంభ హారతి చెంబు, శఠగోపాలు, అంజనేయస్వామి గంట వంటి వాటితో పాటు రూ.25రకాల వస్తువులను చోరీ చేశాడు. వీటి విలువ రూ.3,045,500 కాగా, నిందితుడి వద్ద నుంచి రూ.3,041,500 విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. మధుబాబు 20 సంవత్సరాలుగా చోరీలకు పాల్పడుతున్నాడు. ఇప్పటికే మార్టూరు, జె.పంగులూరు, మద్దిపాడు, సంతమాగులూరు, ఒంగోలు, కనిగిరి, ఇంకొల్లు, బల్లికురవ, చీమకుర్తి పోలీస్‌స్టేషన్‌లలో పలు కేసులు నమోదై ఉన్నాయి.

రాత్రి సమయాలల్లో దేవాలయాలు, తాళాలు వేసి ఉన్న ఇళ్లల్లో చోరిలు చేసి దొంగిలించిన సొత్తును పాత ఇనుప దుకాణాలలో అమ్ముతుంటాడు. సోమవారం ఉదయం అద్దంకి సమీపంలోని కొంగపాడు రోడ్డు వద్ద తనిఖీలు చేస్తుండగా మధుబాబు పట్టుబడ్డాడు. అద్దంకి టౌన్ సీఐ కృష్ణయ్య, బాపట్ల సీసీఎస్ సీఐ ప్రేమయ్య ఆధ్వర్యంలో అద్దంకి ఎస్ఐ ఖాదర్‌బాషా, సిబ్బంది అంకమరావు, మరియదాసు, గోపి మధుబాబును అరెస్టు చేసి సొత్తును స్వాధీనం చేసుకున్నారు. సోమవారం విలేకరుల సమావేశంలో సీఐ ఆ వివరాలను వెల్లడించారు. ఎస్ఐ ప్రవీణ పాల్గొన్నారు.



వివరాలు తెలుపుతున్న సీఐ కృష్ణయ్య, ఎస్ఐలు, సిబ్బంది

పారిశుధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉండాలి

అద్దంకిటౌన్, సెప్టెంబరు 23 : పారిశుధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని మున్సిపల్ కమిషనర్ ఎం.సత్యనారాయణ అన్నారు. సోమవారం అద్దంకి ప్రభుత్వ వైద్యశాల వద్ద స్వచ్ఛత హి సేవ 2024 కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ కార్మికులకు ప్రత్యేక వైద్య శిబిరాన్ని సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి.శరత్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. చీరాల నుంచి గైనకాలజిస్ట్ డాక్టర్ వై.లక్ష్మి, ఒంగోలు నుంచి డెర్మటాలజిస్ట్ డాక్టర్ పి.రాజశేఖర్, సీహెచ్‌సీ పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ పి.వెంకట కిరణ్, డాక్టర్ ఏ.అనితాజ్యోతి, డాక్టర్ జి.ప్రదీప్తి, డాక్టర్ జి.మెర్సీ, డాక్టర్ కె.అవినాష్, డాక్టర్ సుబోద్, ప్రదీప్‌కుమార్ వైద్య శిబిరంలో 105 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి, మందులను అందజేశారు. రోగులకు వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యులు కరి సుబ్బారావు, దామవరపు నాగేశ్వరరావు అల్పాహారం, తాగునీటిని అందించారు.

చీరాల మున్సిపల్ కమిషనర్‌గా అబ్దుల్ రషీద్

చీరాల, సెప్టెంబరు 23 : రాష్ట్రంలో మున్సిపల్ కమిషనర్ల బదిలీలకు సంబంధించి సోమవారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ అనిల్‌కుమార్ సింఘాల్ ఉత్తర్వులు ఇచ్చారు. అందులో భాగంగా వెంకటగిరి మున్సిపాలిటీలో కమిషనర్‌గా పనిచేస్తున్న అబ్దుల్ రషీద్‌ను చీరాల మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు. ప్రస్తుత చీరాల మున్సిపల్ కమిషనర్‌గా డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న చక్రవర్తిని తన మాతృ సంస్థ వ్యవసాయశాఖ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ వైజాగ్‌కు బదిలీ చేశారు. రెండు రోజులలో నూతన కమిషనర్ అబ్దుల్ రషీద్ బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉన్నట్లు కార్యాలయ వర్గాలు తెలిపాయి.

శ్రీమన్నారాయణకు డాక్టరేట్



శ్రీమన్నారాయణకు డాక్టరేట్ అందజేస్తున్న ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ధనుంజయరావు, ఆచార్య విజయలక్ష్మి

మార్టూరు, సెప్టెంబరు 23 : మార్టూరు గ్రామంలోని నేతాజీనగర్‌కు చెందిన గోగులమూడి శ్రీమన్నారాయణకు ఆంధ్ర విశ్వ విద్యాలయం డాక్టరేట్ డిగ్రీని ప్రకటించింది. ఆంధ్ర విశ్వ విద్యాలయ న్యాయ కళాశాల పరిశోధక విద్యార్థి శ్రీమన్నారాయణ డాక్టరు బీఆర్ అంబేడ్కర్ న్యాయ కళాశాలకు చెందిన ఆచార్య విజయలక్ష్మి పర్యవేక్షణలో వాయు కాలుష్యం, భారతీయ చట్టాలు, ప్రభుత్వ విధానాలు అనే అంశానికి సంబంధించి చేసిన విశ్లేషణాత్మకమైన పరిశోధనకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో రిజిస్ట్రార్ ధనుంజయరావు డాక్టరేట్ డిగ్రీని శ్రీమన్నారాయణకు అందజేశారు.

కొమ్మమూరు కాలువకు జలకళ

- కారంచేడు వద్ద ఆరు అడుగులు ఉన్న నీటి మట్టం
- ఎమ్మెల్యే ఏలూరి చొరవ, మంత్రి నిమ్మల ఆదేశాలతో నీటి విడుదల
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



కారంచేడు వద్ద నీటితో కళకళలాడుతున్న కొమ్మమూరు కాలువ

కారంచేడు(పర్చూరు), సెప్టెంబరు 23 : కొమ్మమూరు కాలువలో నీరులేక వేల ఎకరాల్లో సాగుచేసుకున్న వరిని సాగు చేసుకున్న రైతులు కళ్లముందు పైర్లు ఎండిపోతుంటే వాటిని రక్షించుకునేందుకు అన్నదాతలు నానా అవస్థలు పడ్డారు. నీటిని విడుదల చేసి పైర్లను కాపాడాలంటూ అధికారులకు విన్నవించుకున్న పట్టించుకున్న దాఖలాలు లేవు. దీనికి తోడు కాలువకు పడిన గండ్ల మరమత్తులు, అధికారుల మధ్య సమన్వయ లోపంతో నీటి విడుదలకు జాప్యం వాటిల్లింది. దీంతో రైతులు తీవ్ర నిరాశకు గురిచేసింది. ఈ నేపథ్యంలో కాలువలో అరకొర ఉన్న నీటిని ఇంజన్‌ల ద్వారా నారు మళ్ళకు అందించేందుకు సాగు రైతులు తీవ్ర ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొంది. నియోజకవర్గంలో దాదాపు 90వేల ఎకరాలకు వరకు కొమ్మమూరు కాలువపైనే రైతులు ఆదారపడి సాగుచేసుకుంటున్నారు. ఈ కాలువల ద్వారానే పంటపొలాలకు సాగునీరు. ఇప్పటికే వేల ఎరాల్లో వరిని సాగుచేసుకున్న రైతులు పంటలు పైర్లు ఎండుముఖం పట్టడంతో తీవ్ర ఆవేదనకు గురయ్యారు.



నీటి విడుదలతో వరి పైరుతో పచ్చగా ఉన్న పొలాలు

సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే ఏలూరి

సాగునీరు లేక వేల ఎకరాల్లో వరి, నారు మడులు ఎండిపోతున్న విషయాన్ని రైతుల ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు స్పందించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యను నీటి పారుదల మంత్రి నిమ్మల రామారావు దృష్టికి తీసుకుపోయి నీటిని విడుదల చేయించేలా చర్యలు చేపట్టారు. దీంతో అధికారులు తక్షణ చర్యలు చేపట్టి కొమ్మమూరు కాలువకు నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం కారంచేడు వద్ద కొమ్మమూరు కాలువలో నీటి మట్టం 6 అడుగులకు చేరడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

పైర్లకు జీవం పోసినట్లయింది



కళ్ల ముందు నారు మళ్లు ఎండిపోతుంటే తీవ్ర ఆవేదన చెందాం. కొమ్మమూరు కాలుకు నీటిని విడుదల చేయడంతో పైర్లకు ప్రాణం పోసినట్లయింది. సాగునీటి విడుదలకు ప్రభుత్వ యంత్రాంగం చేసిన కృషిని మరువలేం. గత వైసీపీ పాలనలో సాగునీరు అందక వేల ఎకరాల్లో చేతికి అందివచ్చిన పంటను కోల్పోయాం.

- యార్లగడ్డ జోగయ్య, కారంచేడు

నీటి మట్టం తగ్గకుండా చూడాలి



అధికారులు ప్రత్యేక పర్యవేణలో నీటి మట్టం తగ్గకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎండిపోతున్న పైర్లు, రైతులు పడుతున్న అవస్థలపై ప్రభుత్వం చూపిన చొరవ మరువలేం. నీరులేక నారు మళ్లు ఎండిపోతుంటే తీవ్ర కలత చెందాం.

- వై.పాపయ్య, కారంచేడు



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ హరిబాబు

పార్కింగ్‌లో నిబంధనలు పాటించాలి

చీరాలటౌన్, సెప్టెంబరు 23 : చీరాల పట్టణంలో వాహనాల రద్దీ పెరిగినందువల్ల పార్కింగ్ విషయంలో వాహనదారులు నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఎస్ఐ ఆంబోతుల హరిబాబు హెచ్చరించారు. ఇటీవల పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు పెద్ద ఎత్తున తలెత్తుతున్న నేపథ్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్ఐ హరిబాబు పట్టణంలో వాహనాల రద్దీను క్రమబద్ధీకరించారు. ప్రయాణాలు సాగిస్తున్న వాహనదారులకు పలు హెచ్చరికలు జారీ చేశారు. మద్యం సేవించి, రాష్ డ్రైవింగ్ వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఆయనవెంట సిబ్బంది ఉన్నారు.

పాఠశాలకు సాయం అభినందనీయం

అద్దంకిటౌన్, సెప్టెంబరు 23 : పేద పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలకు రోటరీ క్లబ్ తమ వంతు సాయం అందించడం అభినందనీయమని ఎంపీడీవో డీ గంగాధరరావు అన్నారు. సోమవారం రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో నంబూరివారిపాలెంలోని ప్రాథమిక పాఠశాలకు రిటైర్డ్ ఆర్‌జేడీ డాక్టర్ యూ దేవపాలన మనవడు శరణ్‌పాల్ సౌజన్యంతో పాఠశాలకు ఐదు కుర్చీలు, రెండు జింక్ ర్యాకులు, రెండు కూలింగ్ వాటర్ క్యాన్లను బహూకరించారు. అనంతరం దేవపాలనను సభ్యులు, ఉపాధ్యాయులు సత్కరించారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి చుండూరి మురళి సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, సందిరెడ్డి శ్రీనివాసరావు, హళహరి హరిప్రసాద్, సుబ్బారావు, గణపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

బల్లికురవ, సెప్టెంబరు 23 : ఫ్యాక్షన్ గ్రామమైన వేమవరంలో మొబైల్ పద్ధతిలో బైకులో పెట్టుకొని మద్యం అమ్మకాలు చేస్తున్న మూడావత్ పెద్ద సీతయ్య నాయక్‌ను అరెస్టు చేసి అతని వద్ద ఆరు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ జీవీ చౌదరి తెలిపారు. వేమవరం ఎస్టీ కాలనీకి చెందిన పెద్ద సీతయ్య నాయక్ గత కొంత డకాలంగా బైకులో పెట్టుకొని గ్రామంలో మొబైల్ సర్వీసు ద్వారా మద్యం అమ్మకాలు చేస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్ఐ జీవీ చౌదరి సోమవారం మద్యం అమ్మకాలు చేస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు పంపారు.

పొలం పిలుస్తోంది సభలను వినియోగించుకోవాలి

పర్చూరు, సెప్టెంబరు 23 : రైతులకు ఆధునిక వ్యవసాయంపై అవగాహన కల్పించి నాణ్యమైన దిగుబడులను సాధించేలా చేసేందుకే పొలంబడి గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్. మోహనరావు సోమవారం ప్రకటనలో కోరారు. పర్చూరు వ్యవసాయ సబ్‌డివిజన్‌లోని పర్చూరు, కారంచేడు, యద్దనపూడి, ఇంకొల్లు మండలాల పరిధిలో కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ప్రతి మండలంలో వారంలో రెండు రోజులపాటు పొలం బడి కార్యమం జరుగుతుందన్నారు.

ఇంకొల్లు : పావులూరు, కొణికి, సుబ్బారెడ్డిపాలెం, నక్కలపాలెం గ్రామాలలో ఈ 25వ తేదీన జరగనున్న పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి వేణుగోపాల్ కోరారు.

పంగులూరు : మంగళ, బుధవారాల్లో పొలంపిలుస్తోంది కార్యక్రమాలు జరుగుతాయని వ్యవసాయాధికారి డి.సుబ్బారెడ్డి తెలిపారు. 24న రామకూరు, 25న భైటమంజులూరు, ముప్పవరంలో ఉంటాయన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

బల్లికురవ, సెప్టెంబరు 23 : మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో మంగళవారం గ్రామ తెలుగు యువత, గ్రామ పెద్దల సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆశీస్సులు, శంకర్ కంటి ఆసుపత్రి వారి సహకారంతో ఈ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. శిబిరానికి వచ్చే వారు తెల్లరేషన్ కార్డు, కుటుంబ సభ్యుల ఫోను నెంబర్‌ను తీసుకు రావాలని నిర్వాహకులు సూచించారు.

ప్రతిభ గుర్తింపునకే ఆటల పోటీలు

మేదరమెట్ల, సెప్టెంబరు 23 : పాఠశాల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించడం ద్వారా వారిలోని ప్రతిభను గుర్తించవచ్చని ఎంఈవో ఎల్ పున్నయ్య తెలిపారు. సోమవారం పమిడిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ కాజావలి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ప్రతిభ చూపిన వారిని జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయని కల్యాణి, సురేష్, శ్రీను, రాజా, నాగార్జున, గ్రామ పెద్దలు జాగర్లమూడి జయకృష్ణ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

అంగన్‌వాడీ కార్యకర్తల వినతి



వినతిపత్రం అందజేస్తున్న అనంతలక్ష్మి తదితరులు

అద్దంకిటౌన్, సెప్టెంబరు 23 : అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలపై చర్చించి వాటి పరిష్కారానికి చొరవ చూపాలని తెలుగునాడు అంగన్‌వాడీ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు గడ్డం అనంతలక్ష్మి, కార్యదర్శి కొల్లి లక్ష్మి నరసమ్మ కోరారు. సోమవారం గుంటూరులోని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డిని యూనియన్ నాయకలు కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు సామ్రాజ్యం, నాగజ్యోతి, మరియాంబి, బండారు కల్యాణి పాల్గొన్నారు.

చీరాలటౌన్ : ఆశా వర్కర్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని పలువురు ఆశా వర్కర్‌లు కోరారు. సోమవారం జిల్లా వైద్యాధికారి విజయమ్మను కలిసి వినతిపత్రం అందజేశారు. ఏఎన్ఎంల నుంచి కూడా పని భారం అధికంగా ఉన్నట్లు వివరించారు. అధికారులు సమస్యలపై పారదర్శకంగా ఆలోచించి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు ధనలక్ష్మి, ప్రధానకార్యదర్శి వెంకటేశ్వరమ్మ, కోశాధికారి వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం అభినందనీయం

అద్దంకిటౌన్, సెప్టెంబరు 23 : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో గ్రామస్థులు భాగస్వామ్యం కావడం అభినందనీయమని ఎంఈవో 2-బూదాటి సుధాకరరావు అన్నారు. సోమవారం మండలంలోని గోపాలపురంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన యర్రా కోటిస్వాములు, తన కుమారుడు గోపాలకృష్ణ నోట్ పుస్తకాలతో పాటు, మినరల్ వాటర్‌కు సంబంధించిన పరికరాలను పాఠశాలకు బహూకరించారు. ఎంఈవో2 సుధాకరరావు మాట్లాడుతూ దాతల సాయాన్ని వినియోగించుకొని విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని రాణించాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం బీవీ రత్నం, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ మల్లవరపు ఆదిలక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.

రిటైర్డ్ లెక్చరర్ గోరంట్ల లక్ష్మీనారాయణ మృతి



అద్దంకిటౌన్, సెప్టెంబరు 23 : రిటైర్డ్ లెక్చరర్, రోటరీ మాజీ అధ్యక్షుడు గోరంట్ల లక్ష్మీనారాయణ ఆదివారం రాత్రి మృతి చెందారు. సోమవారం లక్ష్మీనారాయణ మృతదేహాన్ని అద్దంకిలోని రోటరీ క్లబ్, ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్, పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సాహితీ సంస్థల సభ్యులు సందర్శించి నివాళులర్పించారు. పలు అభివృద్ధి పనులకు దాతగా ముందుండే లక్ష్మీనారాయణ సేవలను సభ్యులు గుర్తు చేసుకున్నారు.

దుకాణదారులు లైసెన్స్‌లు తీసుకోవాలి

ఇంకొల్లు, సెప్టెంబరు 23 : కిరాణా దుకాణ యజమానులు లైసెన్సులు పొంది, నాణ్యమైన సరుకులను మాత్రమే విక్రయించాలని బాపట్ల జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్ ఆదేశించారు. సోమవారం ఆయన పలు దుకాణాలలో తనిఖీ నిర్వహించారు. లైసెన్స్ లేకుండా వ్యాపారాలు చేస్తున్న వాటిని గుర్తించారు. వెంటనే అనుమతులు తీసుకోవాలని సూచించారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న జన విజ్ఞాన వేదిక నాయకులు, ఉపాధ్యాయులు

రేపు చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్

చినగంజాం, సెప్టెంబరు 23 : జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీన పాఠశాల స్థాయి చెకుముకి సైన్సు టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించనున్నట్లు వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పాఠశాల హెచ్ఎం డి.రత్నకుమారి ఆధ్యక్షతన సోమవారం జరిగిన కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు, ఉపాధ్యాయులు చెకుముకి సైన్సు సంబరాలు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ పాఠశాలలోని 8,9,10 తరగతుల విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీషు మీడియంలో చెకుముకి సైన్సు టాలెంట్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 25న పాఠశాల స్థాయిలో, అక్టోబరు 1న మండల స్థాయి, అక్టోబరు 27న జిల్లా స్థాయి, నవంబరు 9, 10 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, జన విజ్ఞాన వేదిక కార్యకర్తలను సంప్రదించాలని రామారావు కోరారు. కార్యక్రమంలో వేదిక మండల అధ్యక్షుడు ఎస్.నరసింహారావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శ్రీవారి లడ్డూ కల్తీ అపచారం



సమావేశంలో పాల్గొన్న కాపు, బలిజ నేతలు

చినగంజాం, సెప్టెంబరు 23 : శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జరిగిన అపచారం చాలా బాధాకరమని కాపు, బలిజ సంక్షేమ సేన జిల్లా అధ్యక్షుడు తరణి గోపాలకృష్ణ అన్నారు. సోపిరాల రైల్వే గేటు సెంటర్‌లో కాపు, బలిజ సంక్షేమ సేన జిల్లా ఉపాధ్యక్షుడు పర్వతరెడ్డి పార్థసారిధి అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హిందువుల మనోభావాలతో ఆటలాడుకునే ఎవరినైనా కఠినంగా శిక్షించేలా సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు విజ్ఞప్తి చేశారు. లడ్డూ ప్రసాదం కల్తీకి కారుకులైన వైసీపీ పాలకులను, తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు చైర్మన్, మెంబర్లను విచారించి శిక్షలు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో కాపు, బలిజ సంక్షేమ సేన గౌరవ సలహాదారులు చెరుకూరి రాఘవయ్య, బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు శిఖరం కోటయ్య, చీరాల నియోజకవర్గ అధ్యక్షులు పోలుదాసు ఫణికుమార్, నాయకులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి : అర్చకుడు శ్రీనివాసశర్మ

కారంచేడు(పర్చూరు) : హిందూ మనో భావాలను దెబ్బతీసే విధంగా తిరుమల తిరుపతి స్వామివార్ల లడ్డూ ప్రసాదాల కల్తీకి సంబంధించిన దోషులను కఠినంగా శిక్షించాలని కారంచేడు శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రధాన అర్చకులు నందూరి శ్రీనివాస శర్మ డిమాండ్ చేశారు. దీనికి సంబంధించి సోమవారం ఆయన ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. లడ్డూ ప్రసాద కల్తీపై ప్రభుత్వం స్పందించిన తీరుపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

ఇంకొల్లు : లడ్డూ ప్రసాదం కల్తీపై బాధ్యులను శిక్షించాలని ఇంకొల్లు హరిహర ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. పర్చూరు రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయం నుంచి భక్తులు, గ్రామస్థులు ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో హనుమంతరావు, రావి సింగమ్మ, వెంకటరత్నం, వెంకటేశ్వరశాస్త్రి, బండ్ల సుబ్బారావు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం





కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొండయ్య, ధేనువకొండలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న రామకృష్ణ

- 100 రోజుల్లో గాడినపడ్డ రాష్ట్రం
- సీఎం చంద్రబాబుకే అది సాధ్యం
- ఎమ్మెల్యే కొండయ్య
- పలు గ్రామాల్లో ఇంది మంచి ప్రభుత్వం కార్యక్రమం

చీరాల, సెప్టెంబరు 23 : సీఎం చంద్రబాటు అభివృద్ధి, సంక్షేమంకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నారు. ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. మున్సిపల్ పరిధిలోని 23వ వార్డు, చీరాల మండలం బుర్లవారిపాలెం, వేటపాలెం మండలం రామన్నపేటలలో సోమవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయా సందర్భాల్లో నిర్వహించిన సభల్లో ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ వైసీపీ పాలనలో అన్ని వ్యవస్థలు నాశనం అయ్యాయన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవం, మేధస్సుతో రాష్ట్రాన్ని సంక్షేమం, అభివృద్ధి దిశగా పరుగులు పెట్టిస్తున్నారన్నారు. అప్పుల ఊబిలోకి నెట్టేసిన రాష్ట్రాన్ని 100 రోజుల్లోనే గాడిన పెడుతూ, మరోపక్క పథకాలను అమలు చేయడం, ప్రతి నెలా 1వ తేదీ నాటికి పింఛన్‌లు, ఉద్యోగులకు జీతాలు ఇచ్చేలా చేయడం ఒక్క సీఎం చంద్రబాబుకే సాధ్యమైందన్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై స్థానికులు ఎమ్మెల్యేకు వినతిపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చక్రవర్తి, పలువురు అధికారులు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

అద్దంకిటౌన్ : సంక్షేమ పథకాల అమలు కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని, ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా అమలు చేస్తామని టీడీపీ బాపట్ల పార్లమెంట్ ఉపాధ్యాక్షుడు నాగినేని రామకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని ధేనువకొండ గ్రామంలో టీడీపీ వంద రోజుల పాలనలో అమలు చేసిన పథకాలపై ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు. రానున్న రోజుల్లో అమలు చేసే పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తుపాకుల పద్మావతి, వీఆర్వో లక్ష్మయ్య పంచాయతీ కార్యదర్శి ఏ. నాగేశ్వరరావు, గ్రామ టీడీపీ నాయకులు అన్నబత్తిన అజయ్, బోడపాటి హరిబాబు, సచివాలయ సిబ్బంది పాలొన్నారు.

మండలంలోని మణికేశ్వరంలో ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఐటీడీపీ అధ్యక్షుడు కరిముల్లా, టీడీపీ నాయకులు షేక్ బడావలి, ఈసువలి, అంజయ్య, మౌలాలి, మందా మధ్యాస్, దావిదు, కరిముల్లా, కాలేషా, అజ్మతుల్లా, మందా రవి, రాంబాబు, రూబేను, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బల్లికురవ : టీడీపీ కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో ప్రజలకు ఎన్నో మెరుగైన సంక్షేమ పథకాలను అందించిందని సర్పంచ్ పందిరి అంజిబాబు అన్నారు. సోమవారం బల్లికురవలో ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా అధికారులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ప్రజలకు అందించిన కరపత్రాలను అందజేశారు. అనంతరం పంచాయతీ కార్యాలయంలో గ్రామ సభ నిర్వహించి పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏవో కుమారి, పంచాయతీ కార్యదర్శి అనిల్, వీఆర్వో మీనా, శానిటేషన్ అధికారి యలగాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చినగంజాం : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కడవకుదురు, మోటుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని అడవీదిపాలెం గ్రామాల్లో సభలు నిర్వహించారు. కడవకుదురు గ్రామ సచివాలయ ఆవరణలో గ్రామ సర్పంచ్ గొల్లమూరి శివకుమారి అధ్యక్షతన జరిగిన సభలో వీరయ్య మాట్లాడారు. కడవకుదురులో రూ.35లక్షలతో నిర్మించే సిమెంట్ రోడ్లకు, అడవీదిపాలెంలో రూ.10.5లక్షలతో నిర్మించే సిమెంట్ రోడ్లుకు భూమి పూజ చేసినట్లు పంచాయతీరాజ్ ఏఈ డి.దాసు తెలిపారు. గ్రామాల్లో నాయకులు, అధికారులు ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను గురించి వివరించారు. సోపిరాల గ్రామంలో టీడీపీ సీనియర్ నాయకులు టీ.జయరావు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాల ఏవో బి.కల్యాన, ఎంఈవో-2 ఎస్.కోటేశ్వరరావు, గ్రామ కార్యదర్శి ఎం.వెంకటరమణ, కూటమి నాయకులు నక్కల వీరరాఘవులు, చల్లా వెంకటరావు, తోట అశోక్‌చక్రవర్తి, లక్ష్మణరావు, డి.బాలకృష్ణ, కే.ఉదయభాస్కరరావు, సచివాలయ ఉద్యోగులు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.



సభలో పాల్గొన్న సర్పంచ్, అధికారులు



కడవకుదురులో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న నేతలు



పోటీలను ప్రారంభిస్తున్న ఎంఈవో ప్రేమలత

మండల స్థాయి ఆటల పోటీలు ప్రారంభం

మార్టూరు, సెప్టెంబరు 23 : మండల స్థాయి అండర్ 14, అండర్ 17 బాల బాలికల ఆటల పోటీలు సోమవారం మార్టూరు జడ్పీ హైస్కూల్‌లో ప్రారంభమయ్యాయి. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా చీరాల ఉప విద్యాశాఖాధికారి ఎ.శ్రీనివాసరావు హాజరుగా కాగా, ఎంఈవో ప్రేమలత రిబ్బను కత్తిరించి ఆటలపోటీలను ప్రారంభించారు. ఈ పోటీలలో బాల బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, యోగా, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు. సాయంత్రం వరకు పోటీలు ఉత్సాహంగా సాగాయి. మంగళవారం కూడా పోటీలను కొనసాగుతాయని వ్యాయామ ఉపాధ్యాయులు కోటేశ్వరరావు తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ స్కూళ్ల నుంచి వచ్చిన విద్యార్థులు, ఉపాధ్యాయులకు ప్రధానోపాధ్యాయిని రూత్ మెర్సీబాబు పర్యవేక్షణలో ఉపాధ్యాయులు భోజన సౌకర్యాలను కల్పించారు.



శారదను సన్మానిస్తున్న రోటరీ ప్రతినిధులు

ఉపాధ్యాయురాలికి సత్కారం

యద్దనపూడి, (మార్టూరు) సెప్టెంబరు 23 : పిల్లలకు ఉన్నత విలువలతో కూడిన విద్యను బోధించిన టీచర్ శారదను రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు వికాస్ వారు నేషన్ బిల్డర్ అవార్డుతో సత్కరించారు. ఆదివారం గుంటూరులో జరిగిన కార్యక్రమంలో యద్దనపూడి మండలం సూరవరపుపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయిని శారదను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శారదను మండల విద్యాధికారులు పుల్లెల సుబ్రమణ్యేశ్వరరావు, చిలుకూరి గోపి అభినందించారు.

పథకాలను ప్రజలకు అందించాలి

ఇంకొల్లు, సెప్టెంబరు 23 : పథకాలు సక్రమంగా అందేలా అధికారులు పనిచేయాలని టీడీపీ నాయకుడు హనుమంతరావు అన్నారు. భీమవరంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలింతలకు బాలసంజీవని కిట్లు అందేసారు. కార్యక్రమంలో సీడీపీ వో ఝాన్సీ సూపర్‌వైజర్ వాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.